Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 177 | హైదరాబాద్ | గురువారం 21 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# క్యూర్‌లో డేటా సిటీ

## 1,500 ఎకరాల్లో ఏర్పాటు.. హైదరాబాద్ వెలుపలా జీసీసీలు



**ఫ్యూచర్ సిటీలోని పారిశ్రామికవాడలో వివిధ కంపెనీల ప్రాంగణాల్లో త్వరలో భూమిపూజలు చేయడానికి అవసరమైన పనులు చేపట్టాలి. ఇక్కడ స్థాపించే కంపెనీలన్నీ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలి. ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నాం.**

– సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడుల ఆకర్షణకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఏజెన్సీ

హెల్త్‌సిటీకి వైద్య పర్యాటక కేంద్రం తెచ్చేందుకు చొరవ

ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు

పరిశ్రమల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే 20 (ప్రజాతీర్పు)**

హైదరాబాద్ వెలుపలా జీసీసీ(గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ల ఏర్పాటుకు కంపెనీలకు ప్రోత్సాహం అందించేలా ప్రత్యేక పాలసీ రూపొందించాలని, జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పెట్టుబడిదారులకు సహకరించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక ఏజెన్సీని ప్రారంభించాలని స్పష్టంచేశారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలి. కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించండి. డేటా సిటీ కోసం ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని తీసుకోవాలి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ–హైదరాబాద్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాటి ఏర్పాటుకు ఆయా నగరాల ప్రధాన రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించండి. భారత్ ఫ్యూచర్ సిటీ(బీఎఫ్‌సీ)లో ప్రపంచస్థాయి మౌలిక వసతులతోపాటు పర్యావరణహిత నెట్–జీరో విధానాలను అమలు చేయాలి. ఏఐ, హెల్త్ సిటీలు, ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయాలి. ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించండి. అందులో మౌలిక వసతుల

- మిగతా 2వ పేజీలో



# ఇటలీ–ఇండియా బంధం బలోపేతం

ఇండియా–ఇటలీ మధ్య చారిత్రక ఒప్పందాలు

ఐదేళ్ల పాటు పరస్పర సహాయ సహకారాలు

వాణిజ్యం, పెట్టుబడులు, అంతరిక్ష రంగాల్లో సహకారం

రోమ్ చర్చల్లో ఇరు దేశాల ప్రధానులు మోదీ, మెలోని

రోమ్, మే 20: రోమ్ నగరం సాక్షిగా భార త్, ఇటలీ దేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇరు దేశాల బంధాన్ని 'స్పెషల్ స్ట్రాటజిక్ పార్టనర్షిప్' (ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం) కుదరిందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య చారిత్రక ఒప్పందాలు జరిగాయి. దీంతో వాణిజ్యం, పెట్టుబడులు, అంత రిక్షం, రక్షణ, ఏఐ, నౌకాయానం రంగాల్లో ఐదేళ్లపాటు పరస్పర

- మిగతా 2వ పేజీలో



# నా శవంపైనా కాషాయ జెండానే కప్పాలి

బీజేపీ కార్యకర్త ఎవరైనా ఇదే కోరుకుంటారు

- బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టింది మేమే
- ఆ కోపంతోనే పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు
- ఫేక్‌గాళ్ల ఆరోపణలపై స్పందించనక్కర్లేదు
- కొడుకుపై ఆరోపణలొస్తే పోలీసులకు అప్పగించా
- మీడియాతో బండి సంజయ్



# మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ముమ్మాటికీ ద్రోహులే

రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు,
దేశాన్ని అమ్మేస్తున్నారు: రాహుల్ గాంధీ

రాయ్‌బరేలీ: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ముమ్మాటికీ ద్రోహులు అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. వారంతా కలిసి భారత రాజ్యాంగంపై నిత్యం దాడి చేస్తున్నారని, దేశ ప్రయోజనాలను కొంతమంది పారిశ్రామికవేత్తలకు అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్ తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలో రెండో రోజు బుధవారం కూడా పర్యటించారు. స్థానిక విప్లవవీరుడు 'వీరా పాసీ' సంస్మరణార్థం న్విహించిన

- మిగతా 2వ పేజీలో

# ఉద్యోగులకు క్యాష్‌లెస్ వైద్యం?

ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్' ఏర్పాటు

రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్

**(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాత ఆరోగ్య పథకానికి బదులుగా మరింత సమర్థవంతమైన 'ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్' ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యోగులు వైద్య ఖర్చుల భారం నుంచి బయటపడేలా, పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు సమాచారం. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఆరోగ్య పథకంలో ఉద్యోగులు లేదా పెన్షనర్లు ముందుగా ఆసుపత్రి ఖర్చులను భరించి, తర్వాత బిల్లులు సమర్పించి డబ్బుల తిరిగి చెల్లింపు కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. సాంకేతిక సమస్యలు, బిల్లుల పరిశీలనలో ఆలస్యం వంటి కారణాలతో అనేక మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కొత్త ఆరోగ్య ట్రస్ట్ అమల్లోకి వస్తే, ఆసుపత్రిలో చేరిన వెంటనే ఉద్యోగులు రూపాయి కూడా ముందుగా చెల్లించకుండా నగదు రహిత వైద్యం పొందే

- మిగతా 2వ పేజీలో



## ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్‌పై

# 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

13 రాష్ట్రాల్లో దాడులు.. 66 మంది నిందితుల అరెస్ట్

**(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా )**


సైబర్ నేరగాళ్లకు వరంలా మారుతున్న ఘోస్ట్ సిమ్ కార్డుల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని హైదరాబాద్ సిటీ పోలీసు సైబర్ క్రైమ్ విభాగం 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'ను నిర్వహించింది. గతంలో మ్యూల్ ఖాతాదారులపై ఆపరేషన్ ఆక్టోపస్ 1.0, నేరాలకు సహకరిస్తున్న బ్యాంకు అధికారులపై ఆపరేషన్ ఆక్టోపస్ 2.0 నిర్వహించగా.. తాజాగా సైబర్ నేరాలకు వెన్నెముకగా నిలుస్తున్న 'ఘోస్ట్ సిమ్' వ్యవస్థపై 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'తో ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించిన 1194 ఘోస్ట్ సిమ్ కార్డుల ఆధారంగా 18 ప్రత్యేక బృందాలు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఏడు రోజుల పాటు దాడులు నిర్వహించాయి. ఈ క్రమంలో మొత్తం 66 మంది నిందితులను అరెస్ట్ చేశారు. మొత్తంగా 544 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 432 సీల్డ్ సిమ్ లు ఉండగా.. 112 ఓపెన్డ్ సిమ్ లు ఉన్నాయి. వీరిలో 44 మంది ఘోస్ట్ సిమ్ కార్డుల వినియోగదారులు, 20 మంది పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్లు లేదా టెలికాం ప్రమోటర్లు, ఇద్దరు సిమ్ కార్డుల సరఫరాదారులు ఉన్నారు. వీరంతా కలిపి దేశవ్యాప్తంగా నమోదైన 76 సైబర్ నేరాల్లో భాగస్వాములైనట్లు తేలింది. ఈ నేరాలకు సంబంధించిన మొత్తం మోసం విలువ రూ.101.87 కోట్లు.



టెలికాం నెట్‌వర్క్ వారీగా పరిశీలిస్తే.. అరెస్టయిన పీఓఎస్ ఏజెంట్లలో వొడాఫోన్ ఐడియాకు చెందిన వారు 10 మంది, ఎయిర్‌టెల్‌కు చెందిన వారు ఏడుగురు, జియోకు చెందిన వారు ముగ్గురు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు,

- మిగతా 2వ పేజీలో

# దండెత్తిన ఎండ




19 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు

- అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5
- వడదెబ్బతో ఒకే రోజు 11 మంది మృతి
- 25 వరకు వడగాలులు వీస్తాయి: వాతావరణశాఖ
- పగలు బయట తిరగొద్దని ప్రజలకు సూచన

**మే 20 (ప్రజాతీర్పు)**

భానుడి భగభగలకు రాష్ట్రం అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు హడలెత్తిపోతున్నారు. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5, తర్వాత హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో 46.4, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 33 జిల్లాల్లోనూ 40.5 డిగ్రీలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అత్యల్పంగా వనపర్తి జిల్లా చిన్నంబావి గ్రామంలో 40.5 డిగ్రీలుంది. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఇలా వడదెబ్బ బారిన పడి 11 మంది మృతిచెందారు. వీరిలో రైతులు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

భానుడి ఉగ్రరూపంతో పలుచోట్ల గత పదేళ్ల మే నెల రికార్డులు తుడిచిపెట్టుకుపోయాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో

- మిగతా 2వ పేజీలో

# ఉద్యోగులకు క్యాష్‌లెస్ వైద్యం?

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స సులభంగా అందేలా ఆసుపత్రుల జాబితాను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల జీతం నుంచి సుమారు 1.5 శాతం చందా రూపంలో మినహాయింపు ఉండే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి అధికారిక మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో లక్షల రూపాయల వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో, పూర్తి నగదు రహిత వైద్యం అందుబాటులోకి రావడం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. ఆరోగ్య కార్డుల జారీ, ఎంపిక చేసిన ఆసుపత్రుల జాబితా, అమలు విధానం త్వరలో స్పష్టతకు వచ్చే అవకాశం ఉందని ఉద్యోగ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# నా శవంపైనా కాషాయ జెండానే కప్పాలి

- మీడియాతో బండి సంజయ్

మే 20 (ప్రజాతీర్పు)

"నేను చనిపోయాక నా శవంపైనా కాషాయ జెండా కప్పాలన్నదే నా చివరి కోరిక. బీజేపీలో కమిట్‌మెంట్‌తో పని చేసే కార్యకర్త ఎవరైనా ఇదే కోరుకుంటారు" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తాను కొత్త పార్టీ పెడుతున్నానని, కేంద్ర కేబినెట్ నుంచి తనను బర్తరఫ్ చేయబోతున్నారనే ప్రచారాలను ఆయన ఖండించారు. ఫేక్‌గాళ్ల ప్రచారాలపై స్పందించాల్సినఅవసరం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్‌కు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 'సంజయ్.. ఆప్ సంఘర్ష్ కరో.. హమ్ తుమ్హారే సాథ్ హై' అంటూ నినాదాలు చేశారు. అనంతరం సంజయ్‌తో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నేతలతో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు. తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న ప్రచారంపై స్పందిస్తూ.. ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాలకు స్పందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. క్యాబినెట్ నుంచి తనను తొలగించబోతున్నారనే వార్తలపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. "బీఆర్ఎస్ ఎంపీల మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోందేమో.. అందుకే కేసీఆర్, కేటీఆర్ నన్ను బర్తరఫ్ చేయాలని నిర్ణయించి ఉంటారు" అని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టామన్న కోపంతోనే ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. "భగీరథ్ కేసు కోర్టు పరిధిలో ఉంది. పోలీసులు విచారణ కోరితే నేనే నా కొడుకును అప్పగించాను. నేను ప్రజల మధ్య ఉన్నాను. కానీ సోషల్ మీడియాలో నాపై విషప్రచారం చేస్తున్నారు. ఎన్ని తప్పుడు కథనాలు ప్రచారం చేసినా ప్రజలు బీజేపీతోనే ఉంటారు"అని స్పష్టం చేశారు.

# మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ముమ్మాటికీ ద్రోహులే

(మొదటి పేజీ తరువాయి)

బహుజన్ స్వాభిమాన్ సభలో ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మీ ఇళ్లకు వచ్చి మోదీ, అమిత్ షాల గురించి మాట్లాడితే నిలబడి గట్టిగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్‌లు ద్రోహులేనని తేల్చిచెప్పాలని సూచించారు. రాజ్యాంగం, అంబేడ్కర్, గాంధీజీలపై దాడి చేస్తూ దేశాన్ని అమ్మేస్తున్నవారు ద్రోహులు కాక ఇంకేమవుతారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, కుల గణన చేపట్టకుండా జాప్యం చేస్తూ, బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేస్తూ రాజ్యాంగంపై నిత్యం 20 గంటలూ దాడి చేస్తున్నారని నిప్పులు చెరిగారు. త్వరలో ఆర్థిక సంక్షోభం రాబోతోందని, ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆహారం సహా అన్నింటి ధరలు ఎగబాకుతాయని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఎరువుల ధరలు సైతం పెరగడం తథ్యమని అన్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా సామాన్య ప్రజలే నష్టపోతారని, అంబానీ, అదానీలపై ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు. అంబానీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసి, దాన్ని విదేశాలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడని, ఆ సొమ్మును నరేంద్ర మోదీకి చేరవేస్తున్నాడని రాహుల్ ధ్వజమెత్తారు. రాబోయే సంక్షోభం నుంచి ప్రజలను ప్రభుత్వం కాపాడలేదని, దాని ప్రభావం రెండు మూడు నెలల్లో కనిపిస్తుందని అన్నారు. చమురు ధరల విషయంలో ప్రభుత్వం తప్పేమీ లేదని మోదీ అంటున్నారని ఆక్షేపించారు. కానీ, తప్పంతా మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్‌లదని తేల్చిచెప్పారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుండడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని రాహుల్ విమర్శించారు.ప్రధాని మోదీ ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలొనీకి మెలొడీ చాక్లెట్లు బహుమతిగా ఇవ్వడంపై రాహుల్ గాంధీ 'ఎక్స్'లో స్పందించారు. 'అది నాయకత్వ లక్షణం కాదు.. ఉత్తి గిమ్మిక్' అని తేల్చిచెప్పారు. ఒకవైపు పెరిగిపోతున్న ఆర్థిక సంక్షోభాన్ని పట్టించుకోకుండా ఇటలీలో చాక్లెట్లు ఇస్తున్నారని మోదీపై మండిపడ్డారు. మన రైతులు, కార్మికులు, వ్యాపారులు కష్టాల్లో ఉంటే మోదీ మాత్రం నవ్వుతూ రీల్స్ చేస్తున్నారని, అది చూసి బీజేపీ నేతలు, కార్యకర్తలు చప్పట్లు కొడుతున్నారని రాహుల్ విమర్శించారు.

### రాజకీయాల్లో ఆయన రాహువు బీజేపీ చీఫ్ నబీన్ మండిపాటు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ద్రోహి అంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ మాటలు ఆయన అరాచక మనస్తత్వాన్ని, స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని ధ్వజమెత్తారు. 140 కోట్ల మంది ప్రజలను దారుణంగా కించపర్చారని, రాహుల్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బుధవారం డిమాండ్ చేశారు. భారత రాజకీయాల్లో రాహుల్ ఒక 'రాహువు'అని ఆరోపించారు. ఆయన తన ఆలోచనా విధానంతో దేశ రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని విమర్శించారు. వరుసగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుండడంతో అది తట్టుకోలేక నిరాశ, అసంతృప్తికి గురై ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటున్నారని, మానసిక సమతుల్యత కోల్పోతున్నారని రాహుల్‌పై మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దురదృష్టకరమని అన్నారు.

# క్యూర్‌లో డేటా సిటీ

(మొదటి పేజీ తరువాయి)

కల్పన ప్రపంచ స్థాయిలో ఉండేలా అంతర్జాతీయ నగరాలను అధ్యయనం చేయండి. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసిన తర్వాతే భూకేటాయింపులు చేపట్టండి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకదాన్ని ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేసేలా కేంద్రంతో చర్చించండి. అవసరమైతే ప్రధాని మోదీతో నేను మాట్లాడతా. ఫ్యూచర్ సిటీలోని పారిశ్రామికవాడలో వివిధ కంపెనీల ప్రాంగణాల్లో త్వరలో భూమిపూజలు చేయడానికి అవసరమైన పనులు చేపట్టాలి. ఇక్కడ స్థాపించే కంపెనీలన్నీ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలి. ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నాం. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను రప్పించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ఒక ప్రత్యేక ఏజెన్సీ ప్రారంభించాలి. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందించేందుకు ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలి. దీనికి గ్రూప్-1 స్థాయి అధికారిని నియమించే అంశాన్ని పరిశీలించాలి. ఐటీ, పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఉండే ఇన్వెస్ట్ తెలంగాణ ఏజెన్సీలోకి విద్యుత్, ఆర్థిక వంటి శాఖల అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండాలి. ఈ ఏజెన్సీ విధివిధానాల రూపకల్పనకు ముందు తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయండి. ఇతర రాష్ట్రాల్లోనూ అమలులో ఉన్న ఉత్తమ విధానాలను తీసుకోండి" అని సూచించారు.

# ఇటలీ-ఇండియా బంధం బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

సహాయ సహకారాలు చేసు కోనున్నాయి. ఇటలీ రాజధాని రోమ్ నగరంలో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో ఇరు దేశాల సంబంధాలను, ఒప్పందాలను భారత ప్రధాని నరేంద్రమోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని వివరించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఇటలీ చేరుకున్న ప్రధాని నరేం ద్ర మోదీకి అక్కడి ప్రభుత్వం ఘనంగా సైనిక వందనంతో స్వాగతం పలికింది. ఆ తర్వాత విల్లా పాంఫిలిలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. అనంతరం ఇరు దేశాలధినేతలు బుధవారం మీడియాతో మాట్లాడారు. 'భారత్, ఇటలీల మధ్య సంబంధం ఇప్పు డు ఒక కీలక దశకు చేరుకుంది. ఇటీవలి సంవత్సరాల్లో, ఇరుదేశాల మధ్య ఒప్పందాలు అపూర్వమైన వేగంతో విస్తరిస్తున్నాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై ఉమ్మడి దార్శనికత ఆధారంగా, ఒక సౌహార్దపూర్వక స్నేహం నుంచి ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిణామం చెందాయి' అని అన్నారు. 'పారిశ్రామిక శక్తిగా ఇటలీ స్థానాన్ని ప్రతిబింబించే ఇటాలియన్ డిజైన్, తయారీ నైపుణ్యం, ప్రపంచ స్థాయి సూపర్ కంప్యూటర్లు, అలాగే 100కు పైగా యూనికార్లను, 2 లక్షల స్టార్టప్లతో కూడిన భారతదేశపు వేగవంతమైన ఆర్థికవృద్ధి, ఇంజనీరింగ్ ప్రతిభ, విస్తృ తి, ఆవిష్కరణలు, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ మధ్య ఒక శక్తివంతమైన సమన్వయా న్ని ఏర్పరచడమే మా లక్ష్యం' అని అన్నారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల ఇరువైపులా వాణిజ్యం, పెట్టుబడుల పెరుగుదలకు మార్గం సుగమం అవుతుందన్నారు. 'రక్షణ, ఏరోస్పేస్, సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయనాలు, ఫార్మా స్యూటికల్స్, వస్త్రాలు, వ్యవసాయ-ం, ఆహారం, పర్యాటకం, మరిన్ని రంగాలపై దృష్టి సారించి, 2029 నాటికి ఇటలీ, -భారతదేశం మధ్య వాణిజ్యం కోసం నిర్దేశించిన 20 బిలియన్ యూరోల లక్ష్యాన్ని చేరుకోవాలని, అధిగమించాలని ఒప్పందం కుదిరింది' అని తెలిపారు. 'ప్రపంచవ్యాప్తంగా 'మేడ్ ఇన్ ఇటలీ' ఎల్లప్పుడూ శ్రేష్ఠతకు పర్యాయపదంగా ఉందని, నేడు ఇది 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు ఉన్నత-నాణ్యత లక్ష్యాలతో సహజమైన సమన్వ యాన్ని కనుగొంటోంది' అని మోదీ, మెలోనీ అన్నారు. ఈ భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే మూలస్తంభమని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, అధునాతన తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ మౌలి క సదుపాయాలు వంటి రంగాలలో పురోగతితో రాబోయే దశాబ్దాలు అపారమైన పరిధి గల సాంకేతిక విప్లవంతో రూపుదిద్దుకుంటాయని చెప్పారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో సమ్మిళిత అభివృద్ధికి ఏఐని ఒక శక్తివంతమైన సాధనంగా భారతదేశం, ఇటలీ చూస్తున్నాయని వారు తెలిపారు. ఈ విశ్వసనీయ, సమా నత్వంతో కూడిన డిజిటల్ ప్రపంచాన్ని సృష్టించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయ న్నారు. ఏఐని మానవుల కోసం మానవులు సృష్టించిన సాధనంగా భావించడం అంటే, సాంకేతికత వ్యక్తులను భర్తీ చేయలేదని, వారి ప్రాథమిక హక్కులను దెబ్బతీయలేదని, అలా గే ప్రజా చర్చలను తారుమారు చేయడానికి లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను మార్చడానికి ఉపయోగించలేమని చెప్పడమేనని తెలిపారు. భారత్--ఇటలీ సహకారం అంతరిక్ష రంగాన్ని కూడా కవర్ చేస్తుందన్నారు. రక్షణ, భద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో తమ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇటలీ, భారతదేశం భావిస్తున్నా యని వారు తెలిపారు. 'మా సహకారం కీలకమైన సముద్ర మార్గాల భద్రతను నిర్ధారించ డానికి, ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్వర్క్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబ ర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనే స్థైర్యాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది' అని అన్నా రు. ఇంధనం మా భాగస్వామ్యానికి మరో కీలకమైన స్తంభం అని, వైవిధ్యభరితమైన ఇంధన వనరుల వైపు ప్రపంచ పరివర్తనకు ఆవిష్కరణ, పెట్టుబడి, సహకారం అవసరమన్నారు.

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి భారత ప్రధాని మోదీ ఇచ్చిన 'మెలోడి' టాఫీ గిఫ్ట్, ఆమెతో కలిసి దిగిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. జార్జియా మెలోనీ, ప్రధాని మోదీ ఫ్రెండ్షిప్‌నకు నెటిజన్లు 'మెలోడీ' అనే పేరును మూడేళ్ల క్రితమే ఖరారు చేశారు. ఇరు దేశాధినేతల సమావేశం జరిగిన ప్రతిసారీ ఈ హ్యాష్ ట్యాగ్ నెట్టింట తెగ ట్రెండింగ్ అవుతోంది. అయితే, తాజాగా ప్రధాని మోదీ స్వయంగా ఈ హ్యాష్‌ట్యాగ్‌ను గుర్తుచేస్తూ ఇటలీ ప్రధానికి ఒక గిఫ్ట్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తమ ఫ్రెండ్షిప్‌నకు చిహ్నంగా ఉన్న మెలోడీ ప్యాకెట్‌ను పట్టుకుని ఇరు దేశాధినేతలు చిరునవ్వులు చిందిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు కామెంట్లతో హోరెత్తుతోంది. అసలు వీరిద్దరి మధ్య స్నేహ బంధం ఇంతగా బలపడటానికి కారణాలేంటి? మోదీతో మెలోనీకి 'మెలోడీ' ఎలా కుదిరిందనేది ఆసక్తికరంగా మారింది. మోదీతో మెలోనీ ఇంత చనువుగా మెలగడానికి కారణం ఏంటని చాలా మంది ఆరా తీస్తున్నారు. మోదీ, మెలోనీ కలిసి దిగిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఒకే కార్‌లో ప్రయాణించడం.. రోమ్‌లోని చారిత్రక కొలోజియం సందర్శన.. మెలోడీ చాక్లెట్ ప్యాకెట్‌ను ఇటలీ ప్రధానికి మోదీ బహుమతిగా ఇవ్వడం ఇవన్నీ.. నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీరిద్దరూ కలిసి దిగిన ఫొటోలు, వీడియోల పట్ల నెటిజన్లు ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు. ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని, తనకు 'మెలడీ' టోఫీలను బహుమతిగా ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రధాని మోదీ ఒక బహుమతిగా చాలాచాలా రుచికరమైన టోఫీని తీసుకొచ్చారు..-- అదే 'మెలడీ'. 'ఈ బహుమతికి ధన్యవాదాలు' అని బుధవారం సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశారు. గతంలో వీరిద్దరూ కలిసిన సమయంలో 'మెలోడీ' హ్యాష్‌ట్యాగ్‌తో ఫొటోలు వైరల్ అయ్యాయి.

# దండెత్తిన ఎండ

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్ల మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు 2019 మే 24, 29, 30 తేదీల్లో 46.3 డిగ్రీలుండగా బుధవారం అది చెరిగిపోయి దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీలు నమోదైంది. అలాగే హనుమకొండలో గత పదేళ్ల రికార్డు 2017 మే 22, 23 తేదీల్లో 45 డిగ్రీలుంటే తాజాగా 46.4 డిగ్రీలతో కొత్త రికార్డు నమోదైంది. కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, ఇతర జిల్లాల్లో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ తెలిపింది. సాధారణంకన్నా 6.5 డిగ్రీలకు మించి అదనంగా ఉష్ణోగ్రతలుంటే తీవ్ర వడగాలులు, 4.5 డిగ్రీలకు మించి అదనంగా ఉంటే వడగాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ ప్రకటిస్తుంది. గురువారం నుంచి 25 దాకా రాష్ట్రంలో పలుచోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. పగలు ఎండవేడి సమయంలో బయట తిరగరాదని ప్రజలకు సూచించింది. అలాగే ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

### మరింత ముందుకు నైరుతి..

ఎండల వేడి పెరిగినా నైరుతి రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉందని వాతావరణశాఖ తెలిపింది. రాబోయే 3, 4 రోజుల్లో తూర్పు, మధ్య బంగాళాఖాతంలోకి ఇవి ప్రవేశించే అవకాశాలున్నట్లు పేర్కొంది. మరోవైపు భూమికి 900 మీటర్ల ఎత్తులో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఉత్తర తెలంగాణ వరకూ ఉపరితలద్రోణి ఏర్పడింది. దీనికారణంగా తెలంగాణలో అక్కడక్కడ గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశాలూ ఉన్నట్లు తెలిపింది.

### ఎండల ధాటికి విగతజీవులై..

ఎండల ధాటికి పెద్దపల్లి జిల్లా ధర్మారం



మండలం నర్సింగాపురానికి చెందిన రైతు సామ లచ్చిరెడ్డి(58), ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ శ్రీపతి లక్ష్మి(60), పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కనుకుంట్ల కనకయ్య(77), కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు గాజర్ల సతీష్(45), సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లికి చెందిన బోడ లింగరాజు(34) మృతిచెందారు. ములుగులో మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్న బోడ సాంబయ్య(43), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లికి చెందిన ఉపాధిహామీ కూలీ నేరళ్ల సోమయ్య(75), జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన పల్లాటి భిక్షపతి(65), రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లికి చెందిన రైతు లచ్చవ్వ(58), వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన రాజిరెడ్డి(60), ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నాయిని పొచ్చన్న(30)లు ప్రాణాలు కోల్పోయారు.



# సాస్కీ కింద రూ.5వేల కోట్లు అందించండి

### విద్యా రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించండి

### కేంద్ర ఆర్థిక మంత్రికి ఉప ముఖ్యమంత్రి భట్టి వినతి

దిల్లీ: రాష్ట్రంలో మౌలిక వసతుల విస్తరణకు అవసరమైన మూలధన వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం సాస్కీ (స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద తెలంగాణకు అదనంగా రూ.5వేల కోట్లు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలపై కేంద్ర మంత్రులను కలవడానికి దిల్లీకొచ్చిన ఆయన బుధవారం నిర్మలా సీతారామన్, కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. "రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన మూలధన వ్యయం కోసం సాస్కీ కింద రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు వడ్డీ లేని రుణం అందించడం మంచి నిర్ణయం.ఈ పథకం కింద 2025-26లో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడు దానికి అదనంగా మరో రూ.5వేల కోట్లు ఇవ్వండి. విద్యారంగంలో సమూల మార్పులు తేవడానికి రూ.21 వేల కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, మరో రూ.9వేల కోట్లతో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలల నిర్మాణం, డిజిటల్ మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సంకల్పించాం. ఇందుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా రూ.4,049.11 కోట్లు, ఏఐఐబీ ద్వారా రూ.4,903.44 కోట్ల ఆర్థిక వనరుల సమీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు. అయితే ఈ రెండు రుణాలను భవిష్యత్తు తరాల మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగిస్తున్నందున మూలధన వ్యయంగా పరిగణించి ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలి" అని నిర్మలా సీతారామన్‌కు భట్టి విన్నవించారు.

# ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్‌పై 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

(మొదటి పేజీ తరువాయి)

ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ దాడులు జరిగాయి. ఈ కేసుల విచారణలో కీలక విషయాలు బయటకు వచ్చాయి. వినియోగదారులు కొత్త సిమ్ తీసుకోవడానికి వచ్చినప్పుడు లేదా మొబైల్ నంబర్ పోర్టబిలిటీ కేవైసీ కోసం వచ్చినప్పుడు, వారికి తెలియకుండానే అదనపు సిమ్ కార్డులను యాక్టివేట్ చేస్తున్నారు. కస్టమర్ల నుంచి బయోమెట్రిక్ తీసుకునే క్రమంలో.. 'నెట్‌వర్క్ సరిగా లేదు', 'సర్వర్ డౌన్ అయ్యింది', 'వేలిముద్ర సరిగా పడలేదు' అంటూ ఏజెంట్లు నమ్మబలికి.. రెండు, మూడు బయోమెట్రిక్‌ను తీసుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఏకంగా ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి.. నిరక్షరాస్యులు, నిరుపేదలను లక్ష్యంగా చేసుకుని వారి ఆధార్ బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. ఇంటర్ నెట్ ను ఉచితంగా ఇస్తామంటూ ఆశచూపి అమాయకుల పేర్ల మీద సిమ్ కార్డులు సృష్టిస్తున్నారు. తమకు ఎన్ని సిమ్ లు అమ్మితే అంత కమిషన్ తో పాటు సైబర్ నేరగాళ్ల నుంచి డబ్బులు కూడా వస్తుండటంతో ఈ దందా చేస్తున్నారు. ఇలా అక్రమంగా యాక్టివేట్ చేసిన సిమ్ కార్డులను సైబర్ నేరగాళ్లు భౌతికంగా విదేశాలకు తరలించాల్సిన అవసరం లేకుండానే.. అత్యంత ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ సాధారణ సిమ్ కార్డులను యాక్టివేట్ చేసిన వెంటనే, వాటిని ఇ-సిమ్ లుగా మారుస్తున్నారు. విదేశాల్లో కూర్చున్న ప్రధాన సైబర్ ముఠాలకు క్షణాల్లో చేరవేస్తున్నారు. తద్వారా ఆయా దేశాల్లో ఉండే ముఠాలు ఎలాంటి భౌతిక సిమ్ కార్డు లేకుండానే, మన దేశపు మొబైల్ నంబర్లను తమ ఫోన్లలో స్వేచ్ఛగా వాడుకుంటున్నారు. ఈ ఇండియన్ నంబర్లతో వాట్సాప్, టెలిగ్రామ్ ఖాతాలు తెరవడంతో పాటు.. మ్యాట్రిమోనియల్ సైట్లు, ప్రముఖ డేటింగ్ యాప్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన నకిలీ ప్రొఫైల్స్ సృష్టిస్తారు. అమాయకులకు సైబర్ వల వేస్తారు. వారి నుంచి లక్షలాది రూపాయలు, ఒక్కోసారి కోట్లాది రూపాయలు కొల్లగొడుతారు. కొన్ని సందర్భాల్లో న్యూడ్ వీడియో కాల్స్ చేసి బ్లాక్ మెయిల్ చేసే 'సెక్స్‌టార్షన్' ముఠాలు, సీబీఐ పోలీసులమంటూ భయపెట్టే 'డిజిటల్ అరెస్ట్' ముఠాలు సైతం ఈ నంబర్లనే వాడుతున్నాయి. నంబర్ మన దేశానిదే కావడంతో బాధితులు సులభంగా నమ్మి మోసపోతున్నారు. ఇదంతా ఒక పక్కా వ్యూహంతో జరుగుతుంది. తమ టార్గెట్ మేరకు వేలాది సిమ్ కార్డుల యాక్టివేషన్ ప్రక్రియ పూర్తికాగానే, ఆ సిమ్ కార్డులను జారీ చేసిన లోకల్ ఏజెంట్లు రాత్రికి రాత్రే తమ దుకాణాలు మూసేసి బోర్డులు తిప్పేస్తున్నారు. ఈ సైబర్ నెట్‌వర్క్‌ను ఛేధించడంలో సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, ఏసీపీ శివ మారుతి, వారి ప్రత్యేక బృందాలు ఎంతో కృషి చేశాయి. కాగా,'ఘోస్ట్ సిమ్' నెట్‌వర్క్ వ్యవహారాన్ని హైదరాబాద్ సిటీ పోలీస్ చాలా సీరియస్ గా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎయిర్‌టెల్, జియో, వోడాఫోన్-ఐడియా వంటి టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల ఉన్నతాధికారులతో సమావేశం కావాలని నిర్ణయించింది. అలాగే, డీవోటీ, ట్రాయ్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను సంప్రదించి.. నిబంధనల్లోని లోపాలను సరిదిద్దాలని, కేవైసీ ప్రక్రియను మరింత కఠినతరం చేయాలని కోరనుంది. 'మ్యూల్ అకౌంట్స్' సమస్యను అరికట్టడానికి బ్యాంకుల నుంచి ఎలాగైతే పరిష్కారాలను కోరడం జరిగిందో.. ఇప్పుడు టెలికాం సంస్థల నుంచి కూడా 'ఘోస్ట్ సిమ్' సమస్యను నియంత్రించేందుకు కఠినమైన నిబంధనలను అమలు చేయాలని వారికి చెప్పనుంది. ముఖ్యంగా పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్లపై నిఘాను పెంచడం, వారి బాధ్యతను నిర్ణయించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త సిమ్ కార్డుల జారీ, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ప్రక్రియలో తప్పనిసరిగా రియల్-టైమ్ వెరిఫికేషన్ చేయాలి. సైబర్ నేరాల్లో గుర్తించిన సిమ్ కార్డులను వెంటనే డీయాక్టివేట్ చేయాలి. నిబంధనలు పాటించని పీ ఓ ఎస్ ఏజెంట్లను, డిస్ట్రిబ్యూటర్లను అన్ని టెలికాం నెట్‌వర్క్‌ల నుంచి బ్లాక్‌లిస్ట్ చేయాలి. ఎక్కువ సంఖ్యలో సిమ్ కార్డులు జారీ అవుతున్న తీరును గుర్తించేందుకు అధునాతన సాంకేతికతను ఉపయోగించాలి. కేవైసీ చేసే సమయంలో 'మ్యూల్ హంటర్ డేటా', I4C అనుమానితుల డేటాబేస్‌తో అనుసంధానం చేసి తనిఖీలు చేయాలి. టెలికాం సంస్థలు, పోలీసుల మధ్య డేటా షేరింగ్ కోసం ఒక క్రమబద్ధమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఆధార్ వివరాలు, బయోమెట్రిక్ సమాచారం, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దు. సిమ్ కార్డులు తీసుకునే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటూ, కేవలం అధీకృత డీలర్ల వద్దే వాటిని కొనుగోలు చేయాలి. మీ పేరు మీద మీకు తెలియకుండా ఎన్ని సిమ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయో కేంద్ర ప్రభుత్వ పోర్టల్ https://tafcop.sancharsaathi.gov.in ద్వారా వెంటనే చెక్ చేసుకోండి. ఈ 'సంచార్ సాథీ' పోర్టల్‌ను క్రమంతప్పకుండా తనిఖీ చేస్తూ, మీకు తెలియకుండా ఎవరైనా మీ నంబర్‌ను వాడుతుంటే వెంటనే అందులోనే రిపోర్ట్ చేసి బ్లాక్ చేయండి. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే.. ఆ మొదటి గంట గోల్డెన్ అవర్ అత్యంత కీలకం. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, కంగారు పడకుండా.. వెంటనే 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయండి లేదా ఒఒఒ.ఎఎవతీఒతీఅఎవ.స్త్రశీజ.ఆఅ లో ఫిర్యాదు చేయండి. హైదరాబాద్ సిటీ పోలీస్ అందిస్తున్న 'సి-మిత్ర' సేవలను కూడా సద్వినియోగం చేసుకోండి.



# గౌడన్నల్లకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ...

- పల్లె దవాఖానా తో ప్రజల చెంతకు మెరుగైన వైద్యం....
- ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 20.**

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన ను ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ .అంతకుముందు గ్రామంలో ప్రమాద వశాత్తూ దగ్ధం అయిన ఈత వనాన్ని పరిశీలించి,కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని,సంబంధిత అధికారులకు ఫోన్ చేసి న్యాయం చేయాలని అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, డి ఎం హెచ్ ఓ సుజాత,ఎమ్మార్వో నాగార్జున ఎంపీడీవో చిరంజీవి,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్,సర్పంచ్ నిరటి శ్రీనివాస్,మోర హనుమండ్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ రావు,కోల శ్రీనివాస్ రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ సాయి రెడ్డి,మాజీ సర్పంచ్ సామల వేణు,జలంధర్, మర్తిపెల్లి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సయ్య గౌడ్, సాయ గౌడ్,లక్ష్మణ్ గౌడ్,అరవింద్ గౌడ్, శేఖర్ రెడ్డి,యం ఏ ముకీద్,తిరుపతి గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బెజ్జంకి మోహన్, వార్డు సభ్యులు,సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు,మండల గ్రామ నాయకులు,వైద్య సిబ్బంది , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న సన్నిధిలో సినీ బాలనటి చైత్ర...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 20.**



తెలుగు చలనచిత్ర పరిశ్రమ లో బాలనటి గా గుర్తింపు పొంది శంబాల చిత్రంలో బాలనటిగా ప్రత్యేక పాత్ర పోషించి ప్రజాదరణ పొందిన చైత్ర పెద్ది బుధవారం తన కుటుంబ సభ్యులతో తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం చేసుకున్నది. వేదపండితుల చైత్రతో విశేష పూజలు చేయించి వేద ఆశీర్వాదం గావించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కళాశ్రీ అధినేత గుండేటి రాజు, సీనియర్ పాత్రికేయుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బైంసా పరిసర ప్రాంత విద్యార్థిని, విద్యార్థులకు మహా శుభవార్త

## గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు బైంసా) మే 20**




గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బైంసా లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సులనూ ప్రారంభించేందుకు యూనివర్సిటీ అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. ఈ విషయం కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ళ బుచ్చయ్య వెల్లడించారు. ఈ అనుమతితో ఇకపై బైంసా మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ స్వస్థలంలోనే పీజీ విద్యను అభ్యసించే అవకాశం లభించనుంది.ప్రారంభించనున్న పీజీ కోర్సులు,ఎం.కామ్ ఎమ్ కమ్ 60 మంది విద్యార్థులకుఎం.ఏ ఇంగ్లీష్ ఎమ్ ఏ 60, మంది విద్యార్థుల కోసం పీజీ తరగతుల నిర్వహణకు కావలసిన నూతన భవన గదులు, తరగతి గదులు మరియు ఇతర మౌలిక సదుపాయాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పీజీకోర్సులనప్రారంభిస్తున్నాము.విద్యార్థినివిద్యార్థులందరూ.అవకాశాన్ని,వినియోగించుకొని 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సులకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి"అని కోరారు. ఈ నిర్ణయంతో బైంసా విద్యా రంగంలో మరో కీలక ముందడుగు పడిందని విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యావేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రామడుగు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

**రామడుగు, మే 21 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రామడుగు పోలీస్ స్టేషన్ ను కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సీడీ ఫైళ్లు, రికార్డులు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, పెండింగ్ కేసుల స్థితి, పోలీస్ స్టేషన్ మొత్తం పనితీరును ఏసీపీ సమీక్షించారు. తనిఖీలో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. చట్టం మరియు శాంతి భద్రతలను సమర్థవంతంగా నిర్వహించాలని, సీడీ ఫైళ్లు మరియు స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ పర్యవేక్షణను మెరుగుపరచాలని సూచించారు. అలాగే యూఐ కేసులను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరై రోజువారీ పోలీసింగ్ కార్యక్రమాల్లో సమన్వయంతో పనిచేయాలని ఏసీపీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై కోదాటి రాజు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

# మంచిర్యాల రాజకీయాల్లో ప్రేమ్‌సాగర్ ప్రత్యేక ముద్ర...

- కార్యకర్తలే బలం... అభివృద్ధే లక్ష్యం!
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పై ప్రజా తీర్పు ప్రత్యేక కథనం

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 20**



?తెలంగాణ రాజకీయ యవనికపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ జిల్లా రాజకీయాలను శాసించగల సమర్థత, బలీయమైన ప్రజాదరణ ఉన్న అతికొద్ది మంది సీనియర్ నాయకులలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, ఒకరు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సాధించిన ఘన విజయం కేవలం ఒక గెలుపు మాత్రమే కాదు... అది ఆయన దశాబ్దాల రాజకీయ పోరాటానికి, ప్రజాబలానికి నిదర్శనం. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్రేమ్‌సాగర్ రావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనమండలి సభ్యుడిగా పనిచేసిన అనుభవంతో, జిల్లా వ్యాప్తంగా బలమైన క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సరైన క్యాడర్ లేక, పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో ప్రేమ్‌సాగర్ రావు ఒంటిచేత్తో పార్టీని ముందుకు నడిపించారు. గతంలో జిల్లాలో కాంగ్రెస్‌కు దిక్కులేని పరిస్థితుల్లో భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను సాగర్ రావు ముందుండి విజయవంతం చేశారు. ఆ సమయంలో జిల్లాలో కాంగ్రెస్ జెండాను మోయడానికి సరైన నాయకులే లేని తరుణంలో, ఉమ్మడి జిల్లాకు ఒకే ఒక్క నాయకుడిగా నిలబడి పార్టీ ఉనికిని కాపాడారు. ఇప్పుడున్న ఎంతో మంది నాయకులు మధ్యలో వచ్చినవారేనని, కష్టకాలంలో పార్టీని బతికించింది మాత్రం ప్రేమ్‌సాగర్ రావేనని జిల్లా కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా అధైర్యపడకుండా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ జెండాను మోసిన నిరంతర శ్రమ, పట్టుదలకు ఫలితంగానే 2023 ఎన్నికల్లో మంచిర్యాల ప్రజలు ఆయనకు భారీ మెజార్టీతో విజయాన్ని అందించి, ప్రజా పురస్కారం కట్టబెట్టారు.?అయితే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, కష్టకాలంలో అండగా నిలిచిన ప్రేమ్‌సాగర్ రావు లాంటి సీనియర్, విధేయత కలిగిన నాయకుడిని కాంగ్రెస్ అధిష్టానం సరైన రీతిలో గుర్తించకపోవడంపై ఉమ్మడి జిల్లా కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం గతంలో పార్టీలు మార్చి, అధికారంలోకి వచ్చే సమయంలో మధ్యలో చేరిన వారికి అయాచితంగా మంత్రి పదవులు కట్టబెట్టడంపై క్షేత్రస్థాయి క్యాడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మొదటి నుండి పార్టీని పట్టుకుని ఉన్న ప్రేమ్‌సాగర్ రావుకు క్యాబినెట్ ర్యాంక్ మంత్రి పదవి ఇవ్వకుండా, కేవలం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం ఆయన సీనియారిటీని అవమానించడమేనని కార్యకర్తలు భావిస్తున్నారు. అందుకే తనను నమ్ముకున్న కార్యకర్తల ఆత్మగౌరవం కోసం, జిల్లా ప్రయోజనాల కోసం ఆయన ఆ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని సైతం నిరాకరించి, వదిలేసుకున్నారు. ప్రేమ్‌సాగర్ రావు కష్టాన్ని, జిల్లాలో ఆయనకున్న తిరుగులేని పట్టును గుర్తించి ఆయనకు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధిష్టానం ఇప్పటికైనా కళ్ళు తెరిచి సాగర్ రావుకు తగిన గుర్తింపు ఇవ్వకుంటే, రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం తప్పదని పలువురు రాజకీయ విశ్లేషకులు, సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే అభిప్రాయపడుతున్నారు. ?ప్రేమ్‌సాగర్ రావు రాజకీయ శైలి ఎప్పుడూ నిఖార్సైన 'క్యాడర్-ఫస్ట్' సిద్ధాంతాన్ని నమ్మేలా ఉంటుంది. పార్టీల నుండి వలస వచ్చే నాయకుల కంటే, కష్టకాలంలో పార్టీని నమ్ముకుని జెండా మోసిన సామాన్య కార్యకర్తకే ప్రథమ ప్రాధాన్యత దక్కాలనేది ఆయన గట్టి నమ్మకం.పార్టీ కోసం రక్తం, చెమట చిందించిన సామాన్య కార్యకర్తకు అన్యాయం జరిగితే సహించేది లేదు" అని అధిష్టానం ముందే కుండబద్దలు కొట్టిన చరిత్ర ఆయనది. ఈ గుణమే ఆయనను కార్యకర్తల గుండెల్లో 'అన్న'గా నిలిపింది. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజం నైతికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఆయన మద్యపాన నియంత్రణపై కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు మద్యపానానికి దూరంగా ఉండాలని స్పష్టం చేస్తూ, అవసరమైతే మద్యం అలవాటు ఉన్నవారికి పదవులు, టికెట్లు కూడా నిరాకరిస్తామని హెచ్చరించి రాజకీయాల్లో సరికొత్త సంచలనం సృష్టించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనేదే ఆయన తపన. ?ప్రస్తుతం మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు. రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, పట్టణాల సుందరీకరణపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా లక్సెట్టిపేట మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, నిధుల సాధన కోసం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజల మధ్య నిత్యం ఉండే నాయకుడిగా గుర్తింపు పొందిన ప్రేమ్‌సాగర్ రావుకు, నియోజకవర్గ ప్రజలకు మధ్య ఎలాంటి దళారీ వ్యవస్థ ఉండదు. నియోజకవర్గంలో ఏ చిన్న సామాజిక కార్యక్రమం జరిగినా, సామాన్యుడి ఇంట్లో పెళ్లి జరిగినా ఆయన స్వయంగా హాజరవుతారు. ఆయన వాక్చాతుర్యం, సూటిగా మాట్లాడే తీరు, కార్యకర్త కష్టంలో ఉన్నప్పుడు కొండంత అండగా నిలబడే తత్వం ఆయనను లీడర్ల లీడర్‌గా మార్చాయి. మంచిర్యాల నియోజకవర్గ భవిష్యత్తును సరికొత్తగా లిఖిస్తూ, ప్రజాసేవలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌సాగర్ రావుకు దక్కాల్సిన అత్యున్నత గౌరవం దక్కినప్పుడే పార్టీకి శ్రీరామరక్ష అని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.



కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ని కార్యకర్తలకు భరోసా ఇచ్చి ముందుకు నడిపిన కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇక కతం అనే సమయంలో ఇంద్రవెల్లి సభతో రేవంత్ రెడ్డిని , పాదయాత్ర తో భట్టి విక్రమార్క ను ఇప్పుడు ముఖ్యమంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, తెలంగాణ రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు అంటే అది కేవలం ప్రేమ్ సాగర్ రావు, కృషి ఫలితమే కాబట్టి కచ్చితంగా మంత్రి పదవి కట్టబెట్టాలి.

**- వేముల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మంచిర్యాల జిల్లా**



కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ లేని సమయంలో ఉనికే లేని సందర్భంలో ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఒక భరోసా ఇచ్చి ముందుకు నడిపిన ప్రేమ్ సాగర్ రావు కు మంత్రి పదవి ఇస్తే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నాను

**బెల్లంపల్లి పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌస్**

# భవన నిర్మాణ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన కారింగుల శంకర్ గౌడ్

**(వినోద్, ప్రజా తీర్పు, జవహర్ నగర్,మేడ్చల్) మే 20 :-**



మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో జవహర్‌నగర్‌లో నివసిస్తున్న మధ్యతరగతి ప్రజలు, ఇంటి యజమానులు, బిల్డింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులందరికీ అనుకూలంగా ఉండేలా రేట్లు నిర్ణయించి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్మికులకు ప్రత్యేక లేబర్ అడ్డా స్థలం కేటాయించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెన్నాపురం యాదయ్య, గౌరవ అధ్యక్షుడు కొయ్యడా వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాఠి బాబు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు ఎర్రెల్లి మల్లేష్, ఏ. యాకయ్య, కోశాధికారి కోట్ల చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు రమణ రెడ్డి, కొయ్యడా ఐలయ్య, మాధవ్, కె. వెంకటేష్, యాదగిరి, రామస్వామి, మధు, రాములు, జాన్‌తో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేటలో మెడికల్ షాప్‌ల బంద్ సంపూర్ణం.


**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, మే 21(ప్రజా తీర్పు )**

అశ్వారావుపేట మండల కేంద్రంలో మందుల షాపులను బంద్ చేసి యజమానులు నిరసన తెలిపారు. ఆన్‌లైన్ ఫార్మసీల అక్రమ కార్యకలాపాలు, కార్పొరేట్ సంస్థల విపరీతమైన డిస్కౌంట్లకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఫార్మాస్యూటికల్ ట్రేడర్స్ పిలుపు మేరకు అశ్వారావుపేట మండల కేంద్రంలో మందుల షాపుల యజమానులు షాపులు బంద్ చేశారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ మందుల కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చిన జీవో ఇప్పటికీ కొనసాగుతుండటంతో 18 నుండి 60 ఏళ్ల వయస్సు వారు డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఆన్‌లైన్‌లో మందులు కొంటున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా చిన్నపిల్లల ఆరోగ్యం ఖరాబ్ అవుతోందని మండల కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆన్‌లైన్ మందుల వ్యాపారాన్ని బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ షాప్ అసోసియేషన్ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి 'సగటు' బతుకు పాలకుల 'కోట్ల' కొలువు

## పెరుగుతున్న ధరలు తరుగుతున్న జేబులు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు బైంసా) మే 20**




వాహనదారులపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ధరల భారాన్ని మోపింది.నాలుగు రోజుల్లోనే రెండు సార్లు పెట్రోల్,డీజిల్ ధరలు పెరగడం,నిన్న కాకమొన్న సిలిండర్, సి ఎన్ ధరలు సైలెంట్ గా పెరిగిపోవడం సామాన్యుడి నడ్డి విరుస్తోంది. లీటరుకు పైసల్లో పెరిగినట్టు కనిపించినా, ఇది నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చులను పెంచి, మార్కెట్లో ప్రతి వస్తువు ధర ఆకాశాన్నంటేలా చేస్తోంది.

### జీతాలు పెరగవు.. ఖర్చులు తగ్గవు

మధ్యతరగతి కుటుంబాల ఆదాయం ఏళ్ల తరబడి ఒకే చోట స్తంభించిపోతోంది. కానీ, నెలాఖరు వచ్చేసరికి చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి. చదువులు, వైద్యం, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, ఇప్పుడు వీటికి తోడు ఇంధన ధరలు. సగటు జీవి తన జీవితాన్ని నెట్టుకురావడానికే అప్పులపాలు కావాల్సి వస్తోంది

### రాజకీయ నాయకుల 'రాచ'భోగాలు - పెన్షన్ల పండగ

సామాన్యుడు 60 ఏళ్లు దేశానికి సేవ చేసినా సరైన పెన్షన్ గ్యారెంటీ లేదు. కానీ, రాజకీయ నాయకులకు మాత్రం రూల్స్ వేరేలా ఉన్నాయి.

### కోట్లలో జీతాలు, అలవెన్సులు

ప్రజల సొమ్ముతో జీతాలు, ట్రావెల్ అలవెన్స్, డియర్నెస్ అలవెన్స్ ల,పేరిట ప్రజాప్రతినిధులు పొందుతున్న లబ్ధి కోట్లలో ఉంటోంది.

### ఎన్ని పదవులు ఉంటే అన్ని పెన్షన్లు

ఒక వ్యక్తి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఎన్నిసార్లు,ఎన్ని వేర్వేరు పదవులు చేస్తే.అన్ని పెన్షన్లు విడివిడిగా అందుకునే సదుపాయం మన వ్యవస్థలో ఉంది.ఇది సామాన్యుడిని తీవ్ర నిరాశకు గురిచేసే అంశం

### దేశ ఆర్థిక భారం తగ్గాలంటే మారాల్సింది ఇదే!

రాజకీయ నాయకులను ప్రజాసేవకులు అంటారు. కానీ, వారి విలాసాలకే దేశ బడ్జెట్ లో భారీ భాగం ఖర్చవుతోంది. దేశ ఆర్థిక భారాన్ని కనీసం 80% తగ్గించాలన్నా, సామాన్యుడికి ఉపశమనం కలగాలన్నా ఈ క్రింది మార్పులు అత్యవసరం

### నాయకుల పెన్షన్ల రద్దు నియంత్రణ

ఒకే వ్యక్తికి బహుళ పెన్షన్లు ఇచ్చే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి. మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్లపై గరిష్ట పరిమితి విధించాలి.

### సాధారణ ఉద్యోగులతో సమానంగా జీతాలు

రాజకీయ నాయకుల జీతభత్యాలు, ఖర్చులు కూడా ఒక సగటు ప్రభుత్వ ఉన్నతాధికారి లేదా ఉద్యోగి పరిమితులకు లోబడి ఉండాలి.ఉచితాల కత్తెర నాయకులకు ఇచ్చే ఉచిత విద్యుత్, ఉచిత ప్రయాణాలు,విలాసవంతమైన బంగ్లాలు, అపరిమిత ఫోన్ అలవెన్సులపై కత్తెర వేయాలి. ఈ పొదుపు చేసిన సొమ్మును నేరుగా పెట్రోల్,డీజిల్ పై సబ్సిడీలుగా మార్చాలి.పన్నులు కట్టేది సామాన్యుడు. కానీ భోగాలు అనుభవించేది పాలకులు.ఈఅసమానత తొలగినప్పుడే ప్రజాస్వామ్యం' అనే పదానికి నిజమైన అర్థం లభిస్తుంది. సామాన్య మధ్యతరగతి కుటుంబాల దుర్భర జీవితాలు మారాలంటే, వ్యవస్థలో పైస్థాయి నుంచి మార్పు మొదలుకావాలి.

**కపిల్ వాగ్మారే సిఆర్ కే,**
**సీనియర్ పాత్రికేయులు**
**9640414188**

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి





## జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు

**కోహెడ, మే 20 (ప్రజాతీర్పు)**

రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, పిడిశెట్టి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మార్కెట్ యార్డ్ ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఒక్కో రైతు నెల రోజులుగా ఎండలో తమ పంటలను మార్కెట్ కి తీసుకువచ్చి అమ్ముకోలేక తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు మొక్కజొన్న, వరి, సన్ ఫ్లవర్ ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కొనుగోలు కేంద్రంలో నైనా యాభై లారీల ధాన్యం ఉందని, వెంటనే పంటలను కొనుగోలు చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చెపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు చల్ల మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే, గార్ల సొసైటీ చైర్మన్

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) మే 20**

గార్ల. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని బుధవారం ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య , గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగాకలిశారు... సి ఆర్ ఎఫ్ పథకం కింద 20 కోట్ల రూపాయలతో గార్ల, రాం పురం మధ్య ఉన్న పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతుండగా, కురవి మండలం గుండ్రాతి మడుగు వరకు తారు రోడ్డు, ల్యాండ్ ఎక్విటేషన్ కొరకు మరో 12 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలను మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి అందించారు దీంతో మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేతొ, గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఇండ్ల సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ నీ కలిసిన సర్పంచ్ దేవేందర్ నాయక్

**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్). మే.20**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వెంటనే వచ్చేటట్లు చూడాలని గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు ఈ యొక్క కార్యక్రమంలో.. గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తో పాటు వార్డు సభ్యులు ఎం రవి నాయక్, ఎం గోపి నాయక్, ఎం దేవా నాయక్, ఎం ధర్మ నాయక్, ఎం శ్రీనివాస్ నాయక్, ఎం సూర్య నాయక్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది



## ద్వాదశ జ్యోతిర్లింగాల పాదయాత్రకునికి జిడిఆర్ మెమోరియల్ ట్రస్ట్ మద్దతు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 20**

నిర్మల్ జిల్లా కుబీర్ మండలానికి చెందిన జాదవ్ మాధవ్ రావు చేపట్టిన ద్వాదశ జ్యోతిర్లింగాల పాదయాత్రకు మద్దతుగా జిడిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మందుల పంపిణీ జరిగింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ పాదయాత్రికునికి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ,ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రులను,సంప్రదించాలని సూచించారు. మాధవరావు చేపట్టిన పాదయాత్ర గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని, అఖండ భారత్ అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షిస్తూ సాగుతోందని తెలిపారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిడిఆర్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అకౌంటెంట్ జాధవ్ పుండలిక్ రావు, మరాఠా నాయకులు కంతాళే రఘువీర్ పాటిల్, వీఆర్వో సాయినాథ్,శంకర్, ప్రసాద్, సూర్యనారాయణ పాటిల్,అక్షయ్ తదితరులు పాల్గొన్నారు. జిడిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రజల సంక్షేమానికి,సామాజిక సేవకు కట్టుబడి ఉందని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు సాగడం ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు.

## 'సూర్యాస్త్ర' పరీక్ష సక్సెస్

స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా కీలక ముందగుడు పడింది. పుణెకు చెందిన ప్రైవేట్ రక్షణ రంగ సంస్థ 'నిబే లిమిటెడ్' అభివృద్ధి చేసిన 'సూర్యాస్త్ర' రాకెట్ ప్రయోగం సక్సెస్ అయింది. బుధవారం చాందీపూర్‌లో సూర్యాస్త్ర రాకెట్ వ్యవస్థ పనితీరును పరీక్షించగా, రెండు రాకెట్లు అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. 150, 300 కిలోమీటర్ల రేంజ్‌లో సూర్యాస్త్రకు చెందిన రెండు రకాల రాకెట్లను పరీక్షించి చూసినట్టు సదరు కంపెనీ తెలిపింది. ఇందులో ఉపయోగించిన గైడెడ్ రాకెట్లు లక్ష్యాలను దాదాపు 1.5 నుండి 2 మీటర్ల కచ్చితత్వంతో తాకినట్టు పేర్కొన్నది.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

- పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను ఖండిస్తూ ఎడ్ల బండి, రిక్షార్యాలీ
- సామాన్యుల నడ్డి విరిచేలా ఎన్డీఏ సర్కార్ పాలన
- డిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 20**



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఎడ్ల బండ్ల పై ఎక్కి నిరసన తెలపగా, పార్టీ శ్రేణులు రిక్షాపై ద్విచక్ర వాహనాలను ఎక్కించి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించినారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆకుల నరసయ్య తదితరులు అదనపు కలెక్టర్ కు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ సామాన్యుల నడ్డి విరిచేలా పనిచేస్తోంది. ఇటీవల జరిగిన బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు శాసనసభ ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలు పెరుగుతాయని తస్మాత్ జాగ్రత్త అనికాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందే హెచ్చరించారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లుగానే ఎన్నికలు ముగిసిన వారం రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను అమాంతం పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. అందుకే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నేడు కరీంనగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ పేద ప్రజల ఉసురు పోసుకోకుండా పెంచిన పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. గతంల సోనియా గాంధీ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ హయాంలో అంతర్జాతీయ స్థాయిలో బ్యారెల్ ధర ఇప్పటికంటే ఎక్కువ ఉన్నప్పటికీ సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని ఇంధన ధరలను పెంచలేదని అన్నారు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కూడా అదేవిధంగా నడుచుకోవాలని కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధరలు తగ్గించేంత వరకు మా పోరాటం కొనసాగుతుందని అని అన్నారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకుండా ఎక్సైజ్ సుంకం, సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందని, పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో నిత్యవసరాల ధరలు పెరుగుతున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాలు, ఎన్నికల తర్వాత ధరల పెంపు సిద్ధాంతాలతో పనిచేస్తుందని మండిపడ్డారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధర తగ్గినప్పటికీ ఇంధన ధరలు మాత్రం పెరుగుతున్నాయని, దాని ద్వారా నిత్యావసర ధరలు పెరిగి ప్రజల జీవనం సమస్యగా మారిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, కేంద్రం మాత్రం ప్రజలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ బిజెపి పార్లమెంటు సభ్యులను అడ్డుకుంటామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కట్టకమృత్యుంజయం, నాయకులు మల్లికార్జున రాజేందర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఉప్పుల అంజనీ ప్రసాద్ చాంద్ పాషా ఎండి తాజ్ పులి ఆంజనేయులు గౌడ్ ముత్యం శంకర్ గౌడ్ నునావత్ భాస్కర్ నాయక్ పర్వత మల్లేశం చాడ గొండ బుచ్చిరెడ్డి మడుపు మోహన్ గడ్డం విలాస్ రెడ్డి పత్తి మధు కామ్రెడ్డి రాంరెడ్డి బానోతు శ్రావణ్ నాయక్ గుండాటి శ్రీనివాస్ రెడ్డి పొన్నం శ్రీనివాస్ గౌడ్ పడాల అజయ్ గౌడ్ గుమ్మడి రాజకుమార్ వరాల నర్సింగం రాచకొండ ప్రభాకర్ పడిశెట్టి భూమయ్య అహమ్మద్ అలీ గంగుల దిలీప్ అబ్దుల్ రహమాన్ నేహాల్ అహ్మద్ కంది తిరుపతిరెడ్డి కూర నరేష్ రెడ్డి బొడ్డుల విజయలక్ష్మి లక్ష్మణ్ సుద్దాల కమల్ గౌడ్ గుర్రం సంధ్యా తిరుపతి తప్పట్ల రాజు భోగొండ ఐలయ్య నిమ్మల అంజయ్య హాజీ వసీం గడప శ్రీనివాస్ బత్తిని చంద్రయ్య గౌడ్ బషీరుద్దీన్ మొలుగురు సదయ్య పొనగంటి రవీందర్ వేల్పుల వెంకటేష్ వంగల విద్యాసాగర్ కర్రె పావని ఫహాద్ అంజయ్య నాగుల సతీష్ కుంభాల రాజకుమార్ సుదర్శన్ కృష్ణ గౌడ్ గడ్డం శ్రీరామ్ అమీర్ కోదూరు రవీందర్ గౌడ్ కోట శంకర్ శిల్ప మాజీద్ అలీ ఖాన్ శ్రీరాముల రమేష్ మన్నే జ్యోతి పెంట శేఖర్ మూల జైపాల్ లాయికు చిట్టు మల్ల రవీందర్ ఇమ్రాన్ మాలోతు మహాలక్ష్మి ముల్కల కవిత ముక్క భాస్కర్ ఆరిఫ్ కలిముద్దీన్ హస్తపురం తిరుమల అందే శంకర్ రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తిరుపతి రెడ్డి పాషా పోరండ్ల రమేష్ కొలగాని అనిల్ మూల కృష్ణారెడ్డి కంకణాల అనిల్ చిట్టుమల్ల రవీందర్ నూనె గోపాల్ రెడ్డి తోట అంజయ్య హస్త పురం రమేష్ మీసా రామాదేవి హస్త పురం తిరుమల మాదాసు శ్రీనివాస్ షబానా మహమ్మద్ ఊకంటి రవీందర్ రెడ్డి కలిముద్దీన్ కొండా హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## పురుషోత్తమ మాసంలో శ్రీవారి దర్శనం చేసుకున్న బిజెపి నాయకుడు సుభాష్ యాదవ్ కుటుంబం

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 20**

నిర్మల్ జిల్లా బాసర పట్టణానికి చెందిన బీజేపీ అధ్యక్షుడు సుభాష్ యాదవ్,ఆయన కుటుంబ సభ్యులు పురుషోత్తమ మాసం సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు చేరుకుని,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురుషోత్తమ మాసం సందర్భంగా,బాసర పట్టణానికి చెందిన బీజేపీ అధ్యక్షుడు సుభాష్ యాదవ్ తన కుటుంబంతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని,దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్న అనంతరం, సుభాష్ యాదవ్ మాట్లాడుతూ,శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగ తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం తమ ఆనవాయితీగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. భక్తి,నమ్మకంతో స్వామివారిని,దర్శించుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భక్తులతో కిక్కిరిసిన తిరుమలలో ప్రశాంత వాతావరణంలో శ్రీవారి దర్శనం జరగడం ఆనందదాయకమని సుభాష్ యాదవ్ తెలిపారు.



## బిజెపి నాయకులు ఎమ్మార్వో కు వినతి పత్రం

**ఎల్లారెడ్డిపేట, మే 20 (ప్రజా తీర్పు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు అదేవిధంగా జరుగుతున్న ఆలస్యం జాప్యం వలన రైతులు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. దానితోపాటు తరుగు పేరుతో రైస్ మిల్లు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని,రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. కాబట్టి వెంటనే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని, స్థానిక ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దాసరి గణేష్, కృష్ణ హరి,మల్లారపు మహేష్, రంజిత్,సంజీవరెడ్డి,యాదగిరి, కిరణ్ నాయక్,తిరుపతి, ప్రకాష్, సురేష్ నాయక్, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.




## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో యూత్ లీడర్షిప్ సదస్సు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 20(ప్రజాతీర్పు ):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరంలో

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 20**

వెల్జిపూర్ గ్రామంలో కాత్యాయని హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ప్రారంభిచి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే మన ప్రధాన లక్ష్యం. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న పేద ప్రజలకు ఈ శిబిరంఎంతోఉపయోగపడుతుంది. ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామంలో మరిన్ని నిర్వహిస్తాం అని తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉన్నత వైద్యానికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కూనారం పరిశోధన కేంద్రంలో 23 నుంచి విత్తన వారోత్సవాలు

- రైతులకు "కూనారం సన్నాలు
- కె.ఎన్.ఎమ్-1638" విత్తనాల విక్రయం
- అడ్వాన్స్ బుకింగ్‌కు అవకాశం : డాక్టర్ బి. సతీష్ చంద్ర

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 20:**



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలో భాగంగా కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు విత్తన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కూనారం పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన అత్యుత్తమ వరి రకం "కూనారం సన్నాలు కె.ఎన్.ఎమ్-1638" పౌండేషన్ విత్తనం సుమారు 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 10 కిలోల విత్తన సంచి ధర రూ.750గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విత్తనాలను కొనుగోలు చేయదలచిన రైతులకు ఈ నెల 22వ తేదీ నుంచి అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. పరిమిత పరిమాణంలో మాత్రమే విత్తనాలు అందుబాటులో ఉన్నందున రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తన బుకింగ్ తదితర పూర్తి వివరాల కోసం 8333818202 నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ బి. సతీష్ చంద్ర కోరారు.



# యువ పార్లమటటంట్ కార్యక్రమం విజయవంతం

- 280 మందికి పైగా పాల్గొన్న విద్యార్థులు
- ఈ నెల 23న విజేతలకు జ్ఞాపికల ప్రదానం

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 20 :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడో రోజు కార్యక్రమంగా నిర్వహించిన యువ పార్లమటటంట్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పాటల పోటీలు, కథా వర్ణన కార్యక్రమాలు నిర్వహించగా, 280 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఈ నెల 23న పెద్దపల్లి ఐడీఓసీ కలెక్టరేట్‌లో జ్ఞాపికలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఉప ప్రిన్సిపాల్, శిక్షణాధికారులు, సహాయ శిక్షణాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# మహిళా పోలీస్ స్టేషన్ నూతన సీఐకి సన్మానం

## రమేశ్ బాబుకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 20 (ప్రజా తీర్పు):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రమేశ్ బాబును ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్‌తో పాటు పలువురు నాయకులు సన్మానించారు. బుధవారం మహిళా పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు ఎం.ఏ. గౌస్, వై. లెనిన్, తొడుపునూరి రమేశ్ కుమార్‌లు శాలువా కప్పి రమేశ్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేశ్ బాబు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించి మంచి అధికారిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.



# ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నీటి సమస్యకు పరిష్కారంగా నూతన బోరు బావి ఏర్పాటు చేసిన ఐదో వార్డు కౌన్సిలర్ శిల్ప నాగరాజ్


**పటాన్ చేరు, మే 20 (ప్రజాతీర్పు)**

మున్సిపల్ ఎన్నికల్లో ఐదో వార్డులో తనను గెలిపిస్తే సొంత నిధులతో నూతన బోర్ బావి ఏర్పాటు చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శిల్పా నాగరాజ్ యాదవ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో బుధవారం ఐదోవార్డు లో నీటి సమస్య పరిష్కారం కోసం నూతన బోర్ బావి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ జనార్ధన్, నాయకులు వెంకటేష్ గౌడ్ కౌన్సిలర్లు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రెండు ఇంచుల వాటర్ పడటంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు ఎన్నో రోజులుగా నీటి సమస్య ఎదుర్కొంటున్న కాలనీ ప్రజలు నూతన బోరు బావితో సమస్యలు తీరనున్నాయి. త్వరలో మోటారు బిగించి కాలనీ ప్రజలకు నిరంతస్తానని కౌన్సిలర్ తెలిపారు. కాలనీ ప్రజలు కౌన్సిలర్ శిల్ప నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉట్ల కౌన్సిలర్ మహేష్ యాదవ్, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, నాగరాజ్ యాదవ్, పూజారి రాజు, మంద రమేష్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కరుణ సాగర్ రెడ్డి, గురుమూర్తి, నరేష్ చారి, మల్లేష్ యాదవ్, పల్నాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నిలువునా దోచుకుంటున్న "బ్రోకర్" కాంగ్రెస్

- మిల్లర్లతో కుమ్మక్కై ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా మార్చి దోపిడి
- కొత్త తరహా దోపిడీకి తెరలేపిన కాంగ్రెస్ సర్కార్
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 20**



ఆరుగాలం రైతు కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని ఇబ్బందుల గురి చేస్తుందని, ప్రధానంగా నాణ్యమైన ఏ గ్రేడ్ పంటలను సైతం బి గ్రేడ్ గా మార్చడం , తాలు, తరుగు పేరిట కోతలు విధించి కాంగ్రెస్ సర్కార్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తు పెద్ద బ్రోకర్ గా మారిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం కొత్తపల్లి మండలంలో పంట కొనుగోలు కేంద్రాలను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక అధికార యంత్రాంగం తీరుపై ధ్వజమెత్తి మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా కావాలనే 'బి-గ్రేడ్'గా మారుస్తూ, క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మిల్లర్లతో కొమ్మక్కై రైతులను నిలువునా ముంచే కొత్త తరహా దోపిడీకి తెర లేపిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారని, దీనివల్ల 17% ఉండాల్సిన తేమ శాతం 11%కి పడిపోయిందన్నారు. దీనివల్ల రైతులు క్వింటాల్‌కు అదనంగా 7 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ అండతో మిల్లర్లు చెలరేగిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో సంచికి 5-6 కిలోల తరుగు తీసి రైతులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ కూడా అదే బాటలో ప్రయాణిస్తుందని , అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నందుకు సిగ్గుండాలన్నారు. జిల్లావ్యాప్తంగా పంట కొనుగోలు మందకొడిగా కొనసాగుతున్నాయని , రైతులకు పంటపై ఏలాంటి ఆంక్షలు , కోతలు విధించకుండా పంట కొనుగోళ్ళను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగాఎలాంటి తాలు ,తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలనీ,

కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్యను వెంటనే రెట్టింపుచేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొంటున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. అలాగే అకాల వర్షాలతో రైతాంగం పంట నష్టపోకుండా టార్పాలిన్ లను సరఫరా చేయాలని , కాటా చిట్టి ప్రకారమే పేమెంట్ చేయాలని , బి కేటగిరి మోసాలను అరికట్టాలని, రవాణా సౌకర్యం మెరుగుపరచాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి గారు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి సర్పంచులు కోమటిరెడ్డి అంజన్ కుమార్ నునుగొండ మానస ప్రవీణ్ ఉప సర్పంచ్ అరే నరేష్ కట్ల వెంకటేష్ సీనియర్ నాయకులు గుంజేటి శివకుమార్ జవ్వాజి రమేష్ కించ శేఖర్ సోమిరెడ్డి సత్యనారాయణరెడ్డి కడార్ల రతన్ కుమార్ కట్ల శ్రీనివాస్ సోమినేని కరుణాకర్ ఇల్లెందుల ఆనంద్ మెరుగు మల్లేశం బైరెడ్డి వంశీ కూరగాయల మల్లేశం పాల శీను తదితరులతోపాటు వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు



# జగిత్యాల పట్టణ అభివృద్ధికి కృషి...

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 20.**

జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని 42వ వార్డులో రూ. 48 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. నాణ్యతతో పనులు చేయాలని, త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 62 కోట్ల తో జగిత్యాల లో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని పార్కు సంధి దుకాణ దారులు చెత్తను ఇష్టారీతిన పడేయవద్దన్నారు. నూతన బి టి రోడ్డు పక్కన వర్షం నీరు పోయే విదంగా ధోనీ మాదిరిగా ఏర్పాటు చేయాలని, అప్పుడే బీటీ రోడ్డు చెడిపోకుండా ఉంటుందన్నారు. జగిత్యాల పట్టణంలో ట్రేడ్ అనుమతులు ఇచ్చి రెవెన్యూ పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పట్టణం లో నాణ్యతతో పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్ కౌన్సిలర్ నాగరాజు, బొలుసాని శ్రీనివాస్, నవ ఆనంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, పోతునుక మహేష్, రాజు, కప్పల శ్రీకాంత్, ఈశ్వర్, ఖువ అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం నూతన ఎంపీడీవో గా శారదమ్మ బాధ్యతలు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.20**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం నూతన ఎంపీడీవో గా శారదమ్మ బాధ్యతలు చేపట్టారు అనంతరం ఎంపీడీవో శారదమ్మ మాట్లాడుతూ...మండల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి సహకరిస్తామని శారదమ్మ హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, కార్యాలయాల్లో సౌకర్యాల మెరుగుదల, పరిపాలనా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు




# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

- ఏ ఒక్క నిజమైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 20(ప్రజాతీర్పు ):**



స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. జూన్ 25 వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ లు) ఓటర్ల వివరాలకు సంబంధించి ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారం లు ఇస్తారని అన్నారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారం లు జూలై 24 తేదీ వరకు తిరిగి తీసుకుంటారు అని వివరించారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలుపవచ్చునని స్పష్టం చేశారు. వివరాల పరిశీలన తర్వాత, అక్టోబర్ ఒకటవ తేదీన తుది ఎలక్టోరల్ రోల్ జాబితా ప్రదర్శిస్తామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఎ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలలో సమావేశాలు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్ లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈఆర్ఓ లు ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జూన్ 15లోపు సభ్యత్వ నమోదు పూర్తి చేసుకోవాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- టూరిజం గైడ్ పోస్టర్ ఆవిష్కరణ

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 20 :**




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శకత్వంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అతిపెద్ద సంస్థ అని పేర్కొన్నారు. మే 15 నుంచి జూన్ 15, 2026 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఉచిత రక్తదాన శిబిరాలు, క్యాన్సర్, సికిల్ సెల్, తలసేమియా బాధితులకు ఉచిత రక్తం అందించడం, వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి సేవలను రెడ్ క్రాస్ అందిస్తోందని వివరించారు. అనంతరం పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందంకు రెడ్ క్రాస్ సభ్యత్వ పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు సభ్యత్వానికి అర్హుడని, ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా జీవిత, వైస్ ప్యాట్రన్, ప్యాట్రన్ సభ్యులుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. సభ్యత్వ నమోదు కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు ఆధార్, ఓటర్ ఐడి లేదా పాన్ కార్డు అవసరమని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న తెలంగాణ రెడ్ క్రాస్ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమ పర్యవేక్షణ కోసం జిల్లా ఉపాధి అధికారి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్‌లను నోడల్ అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయంలో టూరిజం గైడ్ పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, సహాయ కార్మిక అధికారి మహమ్మద్ రఫీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో మంథని మహిళల సేవాభావం.. ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్న మహిళలు

**మంథని, మే-20(ప్రజాతీర్పు)**



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి సేవ కార్యక్రమంలో మంథని ప్రాంతానికి చెందిన మహిళలు పాల్గొని సేవాభావాన్ని చాటుకున్నారు. మంథని తెరాస నాయకురాలు పుప్పాల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంథనిలోని మరి వాడకు చెందిన 10 మంది మహిళలు తిరుమలలో నిర్వహించిన శ్రీవారి సేవ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సహాయం అందించడం, క్యూ లైన్లలో భక్తులకు సూచనలు ఇవ్వడం, పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి పలు సేవా కార్యక్రమాలను మహిళలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సేవలో పాల్గొనడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలిచిందన్నారు. ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు దర్శనానికి వచ్చే తిరుమలలో వారికి సేవ చేయడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత కలిగిందని తెలిపారు. ఇలాంటి పవిత్ర సేవలో పాల్గొనే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, సేవా భావం, భక్తి మరింత పెరిగాయని అన్నారు. పుప్పాల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, ముఖ్యంగా ఆధ్యాత్మిక సేవల్లో పాల్గొనడం ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మంథని ప్రాంతానికి చెందిన మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తిరుమలలో సేవ చేయడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని మహిళలను కూడా శ్రీవారి సేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. శ్రీవారి సేవలో పాల్గొన్న మహిళలు తిరుమలలోని ఆలయ వాతావరణం, భక్తుల ఆధ్యాత్మిక నమ్మకం, సేవా కార్యక్రమాల నిర్వహణ తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. సేవ చేయడం ద్వారా భక్తుల నుంచి మంచి ఆదరణ లభించిందని, శ్రీవారి ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం రావాలని కోరుకుంటున్నామని మహిళలు ఆకాంక్షించారు.



# కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు 10 ఎకరాలు కేటాయించాలి

## బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 20.**

జగిత్యాల రూరల్ మండలం చెల్ గల్ గ్రామానికి మంజూరు అయిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కనీసం 10 ఎకరాలు స్థలం కేటాయించాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండున్నరేళ్ల కాలం గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలకు శాశ్వత భవనాలు ఏర్పాటుచేయాలని ఆలోచన కూడా చేయలేదన్నారు. కెసిఆర్ నూతన జిల్లాలు ఏర్పాటుచేసి ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, అనుబంధంగా ఆస్పత్రులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అంతే కాకుండా హైదరాబాద్ కు నలువైపుల నాలుగు టీమ్ ఆస్పత్రులు ఏర్పాటు చేశారన్నారు.నిరుద్యోగులు నూతన ఉద్యోగాలు కల్పిస్తారని భావిస్తుంటే వెల్లడించడం లేదన్నారు. రేవంత్ రెడ్డి కనుసన్నల్లో కాంట్రాక్ట్ పనులు కొనసాగేలా స్థానిక రెసిడెన్షియల్ పాఠశాలు నిర్మాణాలు చేపట్టకుండా రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధి విధానాలు ప్రకటించి. నియామకాలు ప్రక్రియ వెల్లడించాలన్నారు. రాజ్యంగా నిబంధనలను అనుగుణంగా గురుకుల పాఠశాలలు ఎక్కడికక్కడ శాశ్వత భవనాలు నిర్మిస్తూ విద్యా వ్యాప్తికి కృషి చేయాలని కోరారు.బీ సి, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు స్థానికంగా స్థల సేకరణ చేసి, శాశ్వత భవనాలు ఏర్పాటు చేయడంతో ప్రజల్లో విద్యా ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి జగిత్యాల పట్ల వివక్షతన.. నిర్లక్ష్యమా.. అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత,నాయకులు బాపురెడ్డి, శివకేసరి బాబు, వెంకటేశ్వర రావు, ప్రవీణ్ ఉన్నారు.

# కుసుమలు పండించిన రైతులను ఆదుకోవాలి

## రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.20**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన రైతులు సుమారు 700 ఎకరాల్లో కుసుమ (సన్ఫ్లవర్) పంటను సాగు చేసి, సుమారు 6000 క్వింటాళ్ల దిగుబడిని సాధించినప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కొనుగోళ్లు నిలిపివేయడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని తెలిసి ఈరోజు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ గారు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు గారు, జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి, గారు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి గారితో కలిసి శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర వ్యవసాయ ఒ రైతు సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారిని కలిసి వినతి పత్రం అందజేసి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నరసయ్య గారు, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, గోలి మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు కడారి జంగయ్య యాదవ్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుండే వెంకటేష్, వివిధ మోర్చా ల నాయకులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్టుకు నిప్పు.. భూ కబ్జాల కోసం దారుణం!

**మంథని, మే-20(ప్రజాతీర్పు)**



"పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అని పెద్దలు చెప్పిన మాటలు నేటి పరిస్థితుల్లో మరుగున పడుతున్నాయి. కొందరు వ్యాపారవేత్తలు, భూకబ్జాదారులు పచ్చని చెట్లనే తమ అక్రమాలకు అడ్డు అని భావిస్తూ వాటిని ధ్వంసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మంథని ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకుని, సూరయ్యపల్లి గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న ఓ పచ్చని చెట్టును అర్ధరాత్రి వేళ నిప్పంటించి కాల్చివేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.మంథని పెట్రోల్ బంక్ నుండి మాతా శిశు ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన, సూరయ్యపల్లి గ్రామపంచాయితీ పరిధిలో ఎక్సైజ్ శాఖకు కేటాయించిన ఖాళీ స్థలంలో ఈ చెట్టు ఎన్నో సంవత్సరాలుగా పెరిగి నిలిచింది. ఎవరు నీళ్లు పోయకపోయినా సహజసిద్ధంగా పెరిగిన ఈ వృక్షాన్ని కొందరు కావాలనే లక్ష్యంగా చేసుకున్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు ఆ చెట్టుకు నిప్పంటించడంతో రాత్రికి రాత్రే అది మంటల్లో కాలిపోయింది. చెట్టు ఉన్న ఖాళీ స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై అటవీ శాఖ, సూరయ్యపల్లి గ్రామపంచాయితీ అధికారులు వెంటనే స్పందించి చెట్టును కాల్చివేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్కడ మళ్లీ చెట్టును నాటి పచ్చదనాన్ని కాపాడాలని కోరుతున్నారు. పచ్చని చెట్టును అక్రమంగా కాల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా..? లేక "ఒక చెట్టే కదా" అంటూ నిర్లక్ష్యం వహిస్తారా..? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. ఈ ఘటనపై డివైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాజకీయలకి అతీతంగా బస్తీల్లో బతుకులు మారాలి

## డా" ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలంగాణ తొలి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్

**వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా, మే 19 :-**




మహేశ్వరం నియోజకవర్గం బస్తీ జేఏసి సమావేశంని అభి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్తీ జేఏసి సమావేశంలో రాష్ట్ర బస్తీ జేఏసి అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ జేఏసి ముఖ్య ఉద్దేశ్యం రాజకీయాలకి అతీతంగా బస్తీ వాసులు కష్టాలు ఎదుర్కొనడం ఎలాంటి నోటీసులు లేకుండా బస్తీలో ఇళ్లను కూల్చడం వల్ల మనలాంటి పేదలకు అన్యాయం జరుగుతుంది దానిని సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాల్సిన బాధ్యత మనపై ఉంది. హైదరాబాద్ లో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి అంటే మన జేఏసి క్రియాశీలకంగా వ్యవహరించాలి. విద్య వైద్యం మిగిలిన సామాజిక ఆర్థిక అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మనల్ని మనం కాపాడుకోవాలి, మనిషికి మనిషి సోషల్ మీడియా వచ్చాక దూరం పెరిగింది విలువలు లేని సమాజం పెరుగుతుంది కాబట్టి విలువల్ని పెంచుకోవాలి అనే ఆలోచనతో ఈ వేదిక ఏర్పాటు చేసాం మనం కావాలనుకునే జీవితం ఒకటి మనం చేసే పని ఒకటి వాటిని దాటి మనం ముందుకు వెళ్ళాలి ధైర్యంగా మనకో మాట సహాయం కావాలి. ఈ సమావేశాన్ని ఇంత పెద్ద ఎత్తున బస్తీల్లో తిరుగుతూ విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర బస్తీ జేఏసి అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేశార.ఈ కార్యక్రమంలో స్తానిక నాయకులు యువకులు పాల్గొన్నారు

# జగిత్యాల జిల్లాలో ఘోర విషాదం

## కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) మే 20**









జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు అమాయక చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన మేడిపల్లి మండల పరిధిలోని కొండపూర్ గ్రామంలో ఇవాళ సాయంత్రం చోటుచేసుకుంది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో ఒకేసారి తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొండపూర్ గ్రామానికి చెందిన మనవిత్ (10), మనస్విని (9), షర్విండ్ (7) అనే ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే మేడిపల్లి పోలీసులు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. స్థానికుల సాయంతో కోనేరులో గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ముక్కుపచ్చలారని చిన్నారుల శవాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది



# మాసాయిపేట్ లో ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో రోడ్డెక్కిన రైతన్నలు

- జాతీయ రహదారిపై రైతులు ధర్నా ఎన్ హెచ్ 44 పై కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్.
- ఎమ్మార్వో కు వ్యతిరేకంగా రైతులు నినాదాలు.
- వర్ష సూచన కారణంగా ఆందోళనలో రైతులు.

**( వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) మే 20**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండలంలోని నాగసానిపల్లి రైతులు గత కొన్ని రోజుల నుండి ఐకెపి సెంటర్లు కొనుగోలు జరగకపోవడంతో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని రైతులకు ఆగ్రహంతో మరో గత్యంతరం లేక బుధవారం మధ్యాహ్నం బొమ్మరం గేటు వద్ద ఎన్ హెచ్ 44 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, ఎమ్మార్వో కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు తక్షణమే స్పందించి ఐ కెపి సెంటర్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే చేగుంట ఎస్ఐ చైతన్య రెడ్డి ధర్నా స్థానానికి చేరుకొని రైతులను సముదాయించి అధికారులతో మాట్లాడతానని హామీతో రైతులు ధర్నాను విరమించారు.



# కపిల్ విద్యా వారధి ఆధ్వర్యంలో విద్యార్థులకు అర్హత పరీక్ష

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 20**

పదవ తరగతి పూర్తి చేసుకుని ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకునేందుకు కపిల్ విద్యా వారధి ( సంక్షేమ ట్రస్ట్) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీ సరస్వతి శిశు మందిర్ లో పదో తరగతిలో 520 కి పైన మార్కులు సాధించిన విద్యార్థులకు అర్హత పరీక్షను నిర్వహించారు. ఈ అర్హత పరీక్షలకు గాను 19 జిల్లాల నుండి 917 మంది అప్లై చేసుకోగా వీరిలో 596 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.. ఈ సందర్భంగా కపిల్ విద్యా వారధి నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు 'కపిల్ విద్యా వారధి' ఆసరా , అండగా నిలవడానికి అర్హత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు . అర్హత పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల పైచదువుల కోసం , జీవితంలో నిలదుక్కుకునే వరకు కపిల్ విద్యా వారధి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్ష నిర్వాహకులు సంగోజు సత్యనారాయణ చారి నంది శ్రీనివాస్ కూర రమేష్ గీకూరు శ్రీనివాస్ శిశు మందిర్ కార్యదర్శి కోలన్నారెడ్డి గట్టు శ్రీనివాస్ శ్రీరామోజు సుభాష్ వకుళాదేవి తదితరులు పాల్గొన్నారు.



# రామగిరి మండలంలో విద్యుత్ సమస్యలతో ప్రజల అవస్థలు

**రామగిరి, మే-20(ప్రజాతీర్పు)**

రామగిరి మండలంలో తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో గంటల తరబడి కరెంట్ నిలిచిపోతున్నప్పటికి విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందనే విషయంపై కూడా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుతున్న ఎండల్లో విద్యుత్ లేక ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికి అధికారులు స్పందించకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను స్థిరీకరించి, కరెంట్ అంతరాయాలపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బిజెపి నాయకులు అలాగే పెద్దపల్లి జిల్లా మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ హెచ్చరిస్తున్నారు.

# మెగా హెల్త్ క్యాంప్. .. టీవీ ముక్త్ భారత్....

**(పగడాల రామారావు ప్రజా తీర్పు బయ్యారంమండల ప్రతినిధి)మే 20**



బయ్యారం. స్థానిక మండల పరిధి జగత్రావుపేట హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో టీవీ ముక్త్ భారత్ అభియాన్ బుధవారం సర్పంచ్ మోహన్ జీ బానోత్ గఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నీ ఏర్పాటు చేయడం జరిగింది స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ , జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ గంధంపల్లి ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్ ఆదేశాల మేరా జగిత్రాపేట సర్పంచ్ బానోత్ మోహన్ జి, అల్లిగూడెం గ్రామ సర్పంచ్ చింత ప్రసాద్ కస్తూరి నగర్ గ్రామ సర్పంచ్ భూక్య రవి నాయక్ వారి ఆధ్వర్యంలోని టీవీ ముక్త్ అభియాన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగినది ఈ ప్రోగ్రాం లో బీపీ షుగర్ జ్వరము మరియు దగ్గు ఆయాసము మరియు ఆకలి మందగించడం రాత్రిపూట చెమటలు పెట్టడం తగ్గినప్పుడు తెమ్మడలో రక్తం పడటం ఛాతి నొప్పి అలాంటి వాళ్లకు ఎక్స్రే తీసి కొన్ని రకాల రక్త పరీక్షలు చేసి క్యాంపు నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పార్టీ నరసింహారావు సెక్రెటరీ డి వెంకటేశ్వర్లు మరియు ఈ క్యాంపు నందు టీవీ నూడల్ అధికారి కృష్ణ చైతన్య మరియు సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ జయరాం మరియు పల్లె దావకాన ఎం ఎల్ హెచ్ పి వెన్నెల మరియు ఎక్స్రే టెక్నీషియన్ వరుణ్ నాయక్ ల్యాబ్ టెక్నీషియన్ మురళి ఏఎన్ఎం పరంగని మరియు కవిత దివ్య కవిత వారి ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించడం జరిగినది ఈ క్యాంపు నందు మా ఆశ కార్యకర్తలతో నిర్వహించడం జరిగినది

# ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక





- రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 20**

జూన్ 2వ తేదీన ఉమ్మడి జిల్లాలో జరగనున్న ఇందిరమ్మ పండుగలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న ప్రాంతాలను బుధవారం రాష్ట్ర ఆబ్కారీ - మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, కె.హరిత, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, అధికారులతో కలిసి సందర్శించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనేక మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని, జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇందిరమ్మ పండుగలో 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇంటి పెద్దగా గుర్తించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేట జిల్లా యువజన, క్రీడా వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో యువతీ యువకులతో "యూత్ పార్లమెంట్" నిర్వహణ

**సిద్దిపేట మే 20(ప్రజా తీర్పు ప్రతినిధి,):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా యువజన క్రీడా వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో యువతి, యువకులతో యూత్ పార్లమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడ వ్యవహారాల అధికారి , జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణ శిక్షణ సహకార కర్తగా 'జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం' వ్యవహరించింది. ఈ సందర్భంగా పార్లమెంటు సమావేశాల వలె జీరో అవర్, క్వశ్చన్ అవర్ బిల్లు ప్రవేశపెట్టే పద్ధతి, ఓటింగ్ , వాదనలు ప్రతి వాదనలు మొదలైన విషయాలతో యూత్ పార్లమెంట్ ఆకట్టుకున్నది. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ స్పీచ్ లను వినిపించారు. ఆమె నిజమైన ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకుడు మంత్రులు ఎంపీలుగా వ్యవహరించారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి స్పీకర్ గా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎర్రన్నగారి రాంగోపాల్ రెడ్డి వ్యవహరించగా, ప్రధానమంత్రిగా శిరీష, ప్రతిపక్ష నాయకుడిగా రాజు, మంత్రులుగా రసజ్ఞ, ఆనంది, హరికృష్ణ, నగేష్, చందన వ్యవహరించారు. వివిధ పక్షాల ఫ్లోర్ లీడర్లుగా సౌమిత్, తన్వి, అఖిల, సాయి మొదలైన వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 70 మంది యువతి యువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు, యువతి యువకులకు పెయింటింగ్, డాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం తరపున అధ్యక్షులు మామిడి పూర్ణచందర్ రావు, ఉపాధ్యక్షులు బండి సమ్మయ్య, గౌరవ సలహాదారు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, ఇంకేసాఫ్ అలీ పాల్గొన్నారు. జ్యూరీ సభ్యులుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బాలరాజు, డిగ్రీ లెక్చరర్ మనోహర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు సౌందర్య, ఉపాధ్యాయులు రాధారి నాగరాజు, సాదత్ అలీ, వెంకటస్వామి పాల్గొన్నారు.



## ఓటరు ప్రత్యేక సవరణ సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ కె వెంకట్ రావు

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు ఇల్లందు) మే 20**

ఇల్లందు :ముందస్తు ప్రతేక్య సవరణ సన్నాహ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె వెంకటరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు మరియు ఏఈఆర్వోలు హాజరవడం జరిగింది. 2025 ఓటరు లిస్టులో ఉన్నవారందరూ2002 ఓటర్ లిస్టు తో మ్యాపింగ్ చేసుకోవాలి. 2002లో ఓటు హక్కు లేకుండా ప్రస్తుతం ఓటు హక్కు కలిగి ఉన్నవారు వారి యొక్క తల్లిదండ్రుల ఓట్లతో మ్యాపింగ్ చేసుకోవాలి. ముఖ్యంగా వివాహం చేసుకొని కోడలుగా వచ్చినవారు వారి యొక్క సొంత ఊరిలో తల్లిదండ్రుల 2002 ఓటర్ వివరాలు సేకరించి ఇక్కడ ప్రస్తుతం నివాసం అన్న బి. ఎల్ ఓ వారికి ఇచ్చినట్లయితే ఇక్కడే మ్యాపింగ్ చేస్తారు. కావున ప్రజలందరూ ఇట్టి కార్యక్రమంలో మ్యాపింగ్ చేసుకుని కోరారు.

## నారాయణపురంలో ఘనంగా ప్రారంభమైన పెద్దమ్మ తల్లి జాతర

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, మే 21(ప్రజా తీర్పు )**



అశ్వారావుపేట మండలం నారాయణపురం కాలని నాయకుల గూడెంలో ఐదు రోజులగా జరిగే పెద్దమ్మ తల్లి జాతర మొదటి రోజు బుధవారం నాడు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమైంది . ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరలో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారు. పెద్దమ్మతల్లి, పులి రాజు వివిధ వేషధారణలతో గ్రామం మొత్తం మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో భాగంగా రాబోయే శనివారం సాయంత్రం అడవిలో నుండి సరుగులు, కర్రలను సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి. ఆదివారం ఉదయం నిప్పుల గుండం ఏర్పాటు చేసి భక్తులు పూలు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆర్ఎఫ్సీఎల్లో అక్రమాలపై పోరాటం కొనసాగిస్తాం

**గోదావరిఖని, మే 14 ( ప్రజా తీర్పు):**



ఆర్ఎఫ్సీఎల్ సంస్థలో కార్మిక దోపిడీతో పాటు భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎన్హెచ్ఆర్సీ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్మెంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్ ఆరోపించారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఉద్యోగాల పేరిట నిరుపేదలను నమ్మించి మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం సరిపడా కార్మికులు లేకపోయినా తక్కువ మంది సిబ్బందితో అధిక పనిభారం మోపుతున్నారని, కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించడం లేదన్నారు. కంపెనీలోని డ్రమ్ములు, స్క్రాప్, పాత సామగ్రి, ఎలక్ట్రానిక్ మోటార్లు, గ్యాస్ కట్టర్స్, కంట్రోల్ వాల్వ్, పైపులు, కేబుల్స్, నట్బోల్ట్ తదితర వస్తువులను అధికారిక టెండర్లు లేకుండా అక్రమ మార్గాల్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పలు విభాగాల అధికారుల ప్రమేయం ఉందని పేర్కొన్నారు. స్టోర్స్, పర్చేస్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్స్ట్రుమెంటేషన్, హెచ్ఆర్, సివిల్, సేఫ్టీ అండ్ ఫైర్, ఫైనాన్స్ విభాగాల సహకారంతో ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. టెండర్ వివరాలు ఆన్లైన్లో అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గత మూడు సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరుతున్నప్పటికీ అధికారులు కావాలనే తప్పుడు సమాచారం ఇస్తూ అసలు విషయాలను దాచిపెడుతున్నారని విమర్శించారు. అయితే ప్రతి అంశానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.20**

మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు, ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్పేట్, మీర్పేట్, ప్రాంతాలలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు గారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలపై అధిక భారం పడుతున్న ప్రాపర్టీ టాక్స్లను తగ్గించాలని కోరారు. అలాగే బడంగ్పేట్ ప్రాంతంలో 33 కేవీ హై టెన్షన్ లైన్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పేద ప్రజల కోసం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని, బలాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పబ్లిక్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అల్మాస్గూడ ప్రాంతంలో కన్వర్షన్ గ్రీన్ జోన్ మరియు రెసిడెన్షియల్ జోన్కు సంబంధించిన హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా స్లమ్ ప్రాంతాలలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి 20 లీటర్ల ఉచిత మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు సంబంధించిన ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు గారు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ కాలనీల అసోసియేషన్ సభ్యులు, బడంగ్పేట్-- మీర్పేట్ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## డీజీపీకి ఫిర్యాదు చేసిన తెలంగాణ జంతు సంక్షేమ, పరిరక్షణ సంఘం అధ్యక్షుడు తోటకూర ప్రవీణ్,ప్రధాన కార్యదర్శి భీష్మ వర్ధన్

### బక్రీద్ ముందు ఆవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి

**:బోడుప్పల్ సర్కిల్/ మే 20: (ప్రజాతీర్పు)**



రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆవుల అక్రమ రవాణా,వధలను అరికట్టాలని కోరుతూ. తెలంగాణ జంతు సంక్షేమ,పరిరక్షణ సంఘం అధ్యక్షుడు తోటకూర ప్రవీణ్,ప్రధాన కార్యదర్శి భీష్మ వర్ధన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అత్యున్నత అధికారి సివి.ఆనంద్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరానికి ఆవులను అక్రమంగా తరలిస్తూ వధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ రవాణా ముఠాల కదలికలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చెక్పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఇప్పటికే పలుమార్లు ఆవులను హైదరాబాద్కు తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పునరావృత నిందితుల వివరాలు, సంబంధిత వాహనాల సంఖ్యలు,ఇతర సమాచారం కలిగిన జాబితాను డీజీపీకి అందజేశారు. అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై నిర్బంధ చర్యలు తీసుకుని, జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు.



## వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 20**

వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేట లో గల రైస్ మిల్, కోటపల్లి మండలం సర్వాయిపేటలో గల గోదాం, వేమనపల్లి మండల కేంద్రంలో గల గోదాములను సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలనుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, మే 21(ప్రజా తీర్పు )**





దమ్మపేట మండల పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా బి.కిషోర్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రాబోయే గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి మండల ప్రజలకు తెలియజేశారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 20**




గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి హాజరై జిల్లాలో పని చేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్ల వివరాలు ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్ కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని, లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని, ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి అనుమతి తీసుకోవాలని, మూసివేసిన స్కానింగ్ సెంటర్ లో ఉన్న పరికరాలు, యంత్రాలను విక్రయించినట్లయితే కొనుగోలు చేసిన వారి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. అరుణశ్రీ, డా. శ్రీదేవి, డా. సుధాకర్, డా. అభినవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డి. పి. ఓ. ప్రశాంతి, సి హెచ్ ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ హారిక, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కేంద్రం పెంచిన చమురు ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

- సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా
- పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై బగ్గుమన్న ప్రజా సంఘాలు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు ఇల్లందు) మే 20**




ఇల్లందు :సిపిఐ ఎం ఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఇల్లందు భగత్ సింగ్ సెంటర్లో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం కేంద్రం పెంచిన చమురు ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేచ్చల రంగారెడ్డి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యపెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై బగ్గుమన్న మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇల్లందు భగత్ సింగ్ సెంటర్లో అధిక ధరలకు వ్యతిరేకంగా మూడు మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరంవారు పాల్గొని మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం 5 రాష్ట్రాల ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు మే 15ఉదయం 6 గంటలకు సామాన్యుడు నిద్రలేచేసరికి భారీగా పెట్రోల్, డీజిల్ పై,, 3.రూపాయలు పెంచి అమల్లోకి తెచ్చి వాహనదారులకు భారీ షాక్ ఇచ్చినది .ఆయిల్ కంపెనీలు పశ్చిమాసియా యుద్ధం సంక్షోభం నేపథ్యం.. హార్మోజ్ జల సంధి మూసివేత కారణాలు చెబుతున్నప్పటికీ,, 2014లో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలో కి వచ్చేనాటికి లీటరు పెట్రోలు 70 రూపాయలు ఉండగా.. 2026 నాటికి 114 రూపాయలకు,, డీజిల్ 60 రూపాయలు ఉండగా.. 98 రూపాయలకు పెంచి,, ఈ 12 సంవత్సరాల కాలంలో 25.30 కోట్ల రూపాయలు భారత దేశ ప్రజలపై భారం వేసింది. 145 కోట్ల ప్రజలపై, వ్యవసాయ రంగం, రవాణా, తదితర రంగాలపై ఆర్థిక భారం మోపి నిత్యావసర ధరలు మరింత పెరగడానికి దోహదం చేసి సామాన్యుడి జీవితం ఖరీదుగా మారిన పరిస్థితి. యుద్ధం రాక మునుపు అమెరికా దేశ అధ్యక్షుడు ట్రంప్.. రష్యా వద్ద ముడిచమురు కొనవద్దని నిర్బంధ ఆంక్షలు వేసి, దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగేటట్లు వ్యవహరించిన ట్రంప్ పై..మోడీ మౌనం దేనికి సంకేతాలు అర్థం చేసుకోవాలి. ట్రంప్ నిర్బంధ ఆదేశాలతో చమురు దిగుమతి వలన భారత దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టి.. ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపి..రానున్న కాలంలో పాకిస్తాన్ లాంటి ఆర్థిక పరిస్థితి రావచ్చని నిపుణులు సూచిస్తున్నారు.దీని వలన నిత్యావసర ధరలు మరింత పెరగడానికి దోహదపడతాయి , నరేంద్ర మోడీ వేసిన పన్నుల భారాన్ని రద్దు చేయాలని, ప్రజలంతా వ్యతిరేకించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు చంద్ర అరుణ జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు ఇల్లందు కొత్తగూడెం పాల్వంచ మణుగూరు డివిజన్ కార్యదర్శులు ఈసం శంకర్ జాటోత్ కృష్ణ గోకినపల్లి ప్రభాకర్ ఆర్ మధుసూదన్ రెడ్డి జిల్లా నాయకులు అమర్లపూడి రాము కల్లూరు కిషోర్ కల్లన్న దుర్గక్క సావిత్రి ధర్మ గోపాలరావు నూప భాస్కర్, లక్ష్మణ్ మాచర్ల సత్యం బుర్ర వెంకన్న టియుసిఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం అన్‌లోడింగ్‌లో నిర్లక్ష్యం..

- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.. • కవ్వ వేణుగోపాల్

**హుస్నాబాద్ మే 20 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకెపి మరియు సొసైటీ కేంద్రాల నుండి వచ్చిన ట్రాక్టర్లలో ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని, రైతులు మరియు ట్రాక్టర్ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు.అక్కన్నపేట మండలం నుండి ట్రాక్టర్లు ఐకెపి, సొసైటీ కేంద్రాల ద్వారా నాలుగు రోజులుగా హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ గోదాములకు చేరుకున్నప్పటికీ, హమాలీ కాంట్రాక్టర్ కేవలం 15 మంది కార్మికులతో మాత్రమే అన్‌లోడింగ్ పనులు నిర్వహించడం వల్ల వాహనాలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయని తెలిపారు. దీంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మార్కెట్ యార్డులో భద్రత లేకపోవడంతో వాహనాల నుండి జాకీలు, కవర్లు దొంగతనానికి గురవుతున్నాయని ఆరోపించారు. ఎక్కువ సమయం బరువుతో నిలిచిపోవడం వల్ల టైర్లు దెబ్బతినడం, ఇంజిన్లపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడుతోందని ట్రాక్టర్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని,ధాన్యాన్ని వెంటనే దించాలని ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళన చేపట్టగా, పోలీసులు వారిని శాంతింపజేశారని, స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.హమాలీ కాంట్రాక్టర్ "ఇష్టముంటే హమాలీలను ఉంచుతాం, లేకుంటే తీసుకెళ్తాం" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని, దీనిపై రెవెన్యూ శాఖ పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా నిర్వహించడంలో ఐకెపి, సొసైటీ అధికారులు విఫలమయ్యారని, లారీలు, ట్రాక్టర్లు సమయానికి పంపడంలో డిఆర్డిఏ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే జిల్ల అధికారులపై రాష్ట్ర మంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, మూడు నాలుగు రోజులుగా నిలిచిపోయిన వాహనాల్లోని ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయించాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## ఆరేపల్లి లి బీసీ భవన్ ,స్టడీ నిర్మించాలి ...

### పచ్చిమట్ల రవీందర్ గౌడ్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ ఇంచార్జ్

**హుస్నాబాద్ మే 20 ప్రజాతీర్పు**

హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లి ప్రాంతంలో బీసీ భవన్, బీసీ స్టడీ సర్కిల్, బీసీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బీఎస్పీ పార్టీ, బీసీ సంఘాల తరఫున మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరేపల్లి వద్ద పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉన్న రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన బీసీ విద్యార్థులు సరైన కోచింగ్ సదుపాయాలు లేక కరీంనగర్, హనుమకొండ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.అదేవిధంగా బీసీ భవన్ లేకపోవడం వల్ల సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు బీసీ సంఘాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఫంక్షన్ హాల్ లేక పెళ్లిళు నిర్వహించేందుకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు.ఆరేపల్లి ప్రాంతంలో పరిశ్రమలు లేక అభివృద్ధి వెనుకబడిపోయిందని, కనీసం బీసీ భవన్, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఆ ప్రాంత అభివృద్ధికి మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే స్థానిక గ్రంథాలయానికి కూడా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు గంగుల రమేష్, కాసబోయిన సాయిలు, చెన్నబోయిన కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## "దండ"కు టి ఆర్ ఎస్ హుజురాబాద్ నియోజకవర్గ కిరీటం

- కవితక్క పార్టీలో కీలకంగా పని చేయనున్న దండ విక్రం రెడ్డి
- అంచెలంచెలుగా ఎదుగుతున్న "దండ"
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ టికెట్ పై గురి

**హుజురాబాద్ మే 20 (ప్రజా తీర్పు )**

హుజురాబాద్ పట్టణ పరిధిలోని ఇప్పలనరసింగాపూర్ గ్రామానికి చెందిన యువ నేత దండ విక్రం రెడ్డి తెలంగాణ రక్షణ సమితి హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నియామకపు ఉత్తర్వులు జా రిచేశారు. దండ విక్రం రెడ్డి మొదట సర్పంచిగా పోటీ ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందినప్పటికీ కృంగిపోకుండా మరోసారి ఎంపిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. తన తల్లిని హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గా గెలిపించుకున్నారు. అలాగే హుజురాబాద్ సింగిల్ విండో ఎన్నికల్లో ఒక ప్యానెల్ ని ఏర్పాటు చేసి ఐదుగురు డైరెక్టర్లను గెలిపించుకున్నారు. ఒకానొక సమయంలో అప్పటి టీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రి ఈటెల రాజేందర్ నే సవాల్ చేశారు. తాజాగా దండ విక్రం రెడ్డి కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తాజాగా స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సేన (టి ఆర్ ఎస్) పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఇకపై నియోజకవర్గస్థాయిలో క్రియాశీల రాజకీయాలు చేయాలని దండ విక్రమ్



భావిస్తున్నట్టు తెలుస్తోంది. దంత విక్రం రెడ్డికి ఇప్పల నర్సింగాపూర్ గ్రామంలో మంచి పట్టు ఉంది. తక్కువ సమయంలోనే ఆయన ఒక ప్రభావితమైన నేతగా నియోజకవర్గంలో ఎదిగారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు అన్ని గ్రామాల్లో విస్తృతంగా సంబంధాలు ఉన్నాయి. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ నుండి పోటీ చేయాలని దండ విక్రం రెడ్డి భావిస్తున్నట్టు తెలుస్తోంది. కవితక్క పార్టీలో చేరిన దండ విక్రమ్ రెడ్డిని పలువురు అభినందిస్తున్నారు.

### మూడు పార్టీలపై ప్రజలు విసుగు చెందారు : దండ విక్రం రెడ్డి

తెలంగాణ లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలపై ప్రజలు విసుగు చెందారని, కొత్త ప్రత్యామ్నాయం దిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారని యువనేత, టి ఆర్ ఎస్ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన దండ విక్రం రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, అలాగే బి ఆర్ ఎస్ పై కూడా ప్రజలు విసుకు చెందారని, బిజెపికి క్షేత్రస్థాయిలో బలం లేదని అన్నారు. రాష్ట్రంలో యువత, మహిళలు కవితక్క నాయకత్వాన్ని బలపరుస్తున్నారని, ఆమె నినాదానికి, భావజాలానికి ఆకర్షితులవుతున్నారని తెలిపారు. నాడు తెలంగాణ ఉద్యమం విస్తరించినట్టుగా మరో ఐదారు నెలల్లో కవితక్క పార్టీ టిఆర్ఎస్ ప్రభంజనం సృష్టించబోతోందని తెలిపారు. కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. వచ్చే రెండు మూడు నెలల్లో గ్రామ గ్రామాన వాడవాడల పార్టీ కమిటీలు వేస్తామని నియోజకవర్గంలో విస్తృతంగా పార్టీ సభ్యత్వం చేస్తామని, క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని, బూత్ కమిటీలు వేస్తామని, అవసరమైతే కవితక్కతో పెద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గ, రైతాంగ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై గళమెత్తుతామని, నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ ఉద్యమాలు చేస్తామని, తమ పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తామని వెల్లడించారు.



## కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు ప్రభుత్వ వైఫల్యమే..!

### హుస్నాబాద్ బిఆర్ఎస్ నాయకులు

**హుస్నాబాద్ మే 20 ప్రజా తీర్పు**

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే ధాన్యం అమ్ముకునే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హుస్నాబాద్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయి లేని మల్లికార్జున్ రెడ్డి ,సుద్దాల చంద్రయ్య ఆరోపించారు. హుస్నాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాళ్ళు మాట్లాడుతూ రైతులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొని పండించిన పంటను అమ్మేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అక్కడ అడుగడుగునా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పదిహేను రోజుల పాటు రాత్రింబవళ్లు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెలన్నర దాటినా ఇప్పటికీ దాదాపు ఇరవై శాతం ధాన్యం కేంద్రాల్లోనే ఉండిపోయిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.తరుగు పేరిట మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమన్నారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పర్యటిస్తే, మంత్రి పొన్నం తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులతో ఆయనపై విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత పూర్తిగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌దేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు మానుకుని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. లేకపోతే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బూర వెంకన్న గౌడ్, దొంతబోయిన శ్రీనివాస్, పూదరి సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐ హెచ్ ఆర్ ఎఫ్ ఇంటర్నేషనల్ డిఫెండర్స్ అవార్డు అందుకున్న విజయ సాగల

### గోవాలో ఘనంగా అంతర్జాతీయ డిఫెండర్స్ అవార్డ్స్

**వినోద్, ప్రజా తీర్పు,మేడ్చల్ జిల్లా మే 20 :-**



మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు గోవా రాష్ట్రంలోని మండోవి నదిపై ఏర్పాటు చేసిన క్రూయిజ్‌లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఐ హెచ్ ఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డిఫెండర్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళా సామాజిక కార్యకర్తలు విజయ సాగల కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డులు అందజేయడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఐ హెచ్ ఆర్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్న విజయ సాగల ఇంటర్నేషనల్ డిఫెండర్స్ అవార్డు ప్రదానం చేయగా, జన్మభూమి నగర్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త విజయ సాగల కి హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐ హెచ్ ఆర్ ఎఫ్ జాతీయ చైర్మన్ మరియు వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది కొంగర అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, 2014లో ప్రారంభమైన ఐ హెచ్ ఆర్ ఎఫ్ సంస్థ నేడు దేశవ్యాప్తంగా వేలాది సభ్యులతో మానవ హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బాల్య వివాహాల నివారణ, గృహ హింసకు గురైన మహిళలకు అండగా నిలవడం, బాధితులకు న్యాయ సహాయం అందించడం, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటం చేయడం వంటి అంశాల్లో మహిళల విశేష సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. విజయ సాగల ఇప్పటికే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు, నారీ శక్తి పురస్కార్, మహిళ విజయ స్టార్ మహి అవార్డు వంటి అనేక గౌరవాలు అందుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రజలు, మహిళా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్త విజయ సాగల కు అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.



## నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామ రైతుల వడ్ల కొనుగోలు సమస్యపై రాస్తారోకో

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 20**

మేము మంచిర్యాల జిల్లా, నెన్నెల మండలం, గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతులము. ప్రస్తుతం మా గ్రామంలో రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. దీంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వర్షాల కారణంగా వడ్లు తడిసి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా కూడా పాడి కొనుగోలు ఆలస్యంపై రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం కోసం అప్పులు చేసి, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి పంట పండించాము. కానీ కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, లారీలు మరియు హమాలీల కొరత కారణంగా వడ్లు నిల్వ ఉండిపోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మా గ్రామ రైతుల వడ్లను కొనుగోలు చేయకపోతే మాకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అందువల్ల మా వినతిని గౌరవించి: 1. గొల్లపల్లి గ్రామంలో వెంటనే వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి. 2. కొనుగోలు కేంద్రంలో అవసరమైన హమాలీలు, లారీలు మరియు తార్పాలిన్ సదుపాయాలు కల్పించాలి. 3. రైతులకు ఎటువంటి తేమ కోతలు లేకుండా న్యాయమైన ధర చెల్లించాలి. 4. కొనుగోలు చేసిన వడ్లకు వెంటనే చెల్లింపులు జరగేలా చర్యలు తీసుకోవాలి. మా రైతుల సమస్యను అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రార్థిస్తున్నాము.

**వినతిదారులు, గొల్లపల్లి గ్రామ రైతులు, నెన్నెల మండలం,మంచిర్యాల జిల్లా.**

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020